ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# వ్యవసాయ బడ్జెట్ ప్రసంగం

## (2024-25)


**శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు**

వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక,

పాడిపరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖామాత్యులు

# 2024-25 వ్యవసాయ బడ్జెట్ ప్రసంగం

గౌరవ సభాపతి, గౌరవ ముఖ్యమంత్రి వర్యులు, గౌరవ సహచర మంత్రివర్యులు మరియు గౌరవ సభ్యులందరికీ నా హృదయపూర్వక నమస్కారములు.

ప్రముఖ కవి గుఱ్ఱం జాషువా గారు రైతు గురించి వ్రాసిన పద్యంతో వ్యవసాయ బడ్జెట్ ప్రారంభించటం సముచితం.

**వాని రెక్కల కష్టంబు లేనినాడు**
**సస్యరమ పండి పులకింప సంశయించు**
**వాడు చెమ్మట లోడ్చి ప్రపంచమునకు**
**భోజనము పెట్టు వానికి భుక్తి లేదు !**

రైతుకి పై పరిస్థితి మారాలని, రైతే రాజు కావాలని మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆకాంక్ష.

ఆరుగాలం ఇంటిల్లిపాదీ శ్రమించి ఈ ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నకు మనసా.. వాచా..కర్మణా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను.

నడిసముద్రంలో గమ్యంలేని దిశగా కొట్టుకుపోతున్న నావకు చుక్కానివలే, అంధకారమనే అగాధంలో పడిపోతున్న ఆంధ్ర రాష్ట్రానికి దిశానిర్దేశం చేసే దక్షత, దార్శనికత కలిగిన నాయకుడు కావాలని ఇటు సంక్షేమం అటు అభివృద్ధి సమ దృష్టితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్ళగలిగే నాయకుడు కావాలని... ప్రజలు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుని, అభ్యుదయ పరిపాలన రీతికి రాజనీతిజ్ఞతకి నిలువెత్తు నిదర్శనమైన మన ప్రియతమ నేత చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నారు.

ఇంతటి ఘన విజయం అందించిన రాష్ట్ర ప్రజల ఋణం తీర్చుకునేందుకు మనం నిరంతరం కష్టపడాలని మన ముఖ్యమంత్రి గారు మాకు పదే పదే చెబుతుంటారు.

అధ్యక్షా !

**వ్యవసాయ శాఖ**

**గ్రామీణ ప్రాంతాలు వెలుగులీనుతూ, రైతు కుటుంబాల్లో సంతోషం నింపాలంటే వ్యవసాయానికి నిర్దిష్ట ప్రణాళిక అవసరం అని ... దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న డా.ఎం.ఎస్. స్వామినాథన్ సూచించారు.**

ఆ మహనీయుని మాటల్లో ప్రతి అక్షరం సత్యమని గ్రహించింది ఈ ప్రభుత్వం. అందుకే రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరు అయిన వ్యవసాయ రంగాన్ని మరింత పరిపుష్టి చేసి రైతులను స్థితిమంతులుగా చూడాలని స్వర్ణాంధ్ర @ 2047 లక్ష్యంలో ఈ రంగానికి అగ్రతాంబూలం ఇచ్చారు.

దేశానికే అన్నపూర్ణగా పేరుగాంచిన మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయ రంగం వెన్నెముక వంటిది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 62 శాతం జనాభా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు.

గడిచిన ఐదేళ్ళ కాలంలో పంటల సాగుకు ప్రాణాధారమైన భూసార పరీక్షలను చేయటం విస్మరించారు, పంటల దిగుబడికి కీలకమైన సూక్ష్మపోషకాలను, అలాగే చిన్న, సన్నకారు రైతులకు అత్యంత అవసరమైన వ్యక్తిగత పనిముట్లను రాయితీపై అందివ్వలేదు. రబీ కాలంలో పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా సాయంతో అండగా నిలవాలన్న బాధ్యతను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. అంతేకాకుండా గత సంవత్సరంలో కరువు పీడిత ప్రాంతాలకు పంటల బీమా అందించాలన్న విచక్షణను మరిచారు.

మన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రైతు అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా భావించి, వ్యవసాయ శాఖకు సంబంధించిన భూసార పరీక్ష పత్రాల జారీ, పొలం పిలుస్తోంది, డిజిటల్ వ్యవసాయంలో భాగంగా ఫార్మర్స్ రిజిస్ట్రీ ఏర్పాటుకు చర్యలు, పంటల సాగులో డ్రోన్ వినియోగంపై అవగాహన మరియు శిక్షణ, కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేశాం. ఆగష్టు / సెప్టెంబర్ నెలలో రాష్ట్రాన్ని కుదిపేసిన వరదల్లో పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ సహాయాన్ని పెంచడమే కాకుండా **నెల రోజుల్లో**నే బాధిత రైతులకు నేరుగా సొమ్ము అందించడానికి కంటిమీద కునుకు లేకుండా శ్రమించి అండగా నిలిచారు మన ముఖ్యమంత్రి గారు.

రానున్న కాలంలో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం 2024, రైతు బృందాలకు డ్రోన్‌ల సరఫరా, రైతులకు వ్యక్తిగత పనిముట్లు, రాయితీపై విత్తన సరఫరా, బంజరు భూములను సాగులోకి తీసుకురావడం, అన్నదాత సుఖీభవ-పి.ఎం.కిసాన్, పంటల బీమా, వడ్డీలేని ఋణాలు వంటి పథకాలు అమలు చేయబోతున్నాం.

2024-25లో వ్యవసాయ శాఖలోని రైతు సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల కోసం బడ్జెట్ ప్రవేశపెడుతున్నాం.

**భూసార పరీక్షా ఫలితా పత్రాలు** (SHC):

పంటల దిగుబడికి భూసారమే కీలకం. రైతుకు తన పొలంలోని మట్టి సారం, పోషక లోపాలు తెలిస్తేనే ఏ కాలంలో ఏ పంట సాగు చేయాలో తెలుస్తుంది. ఇలా మట్టి నమూనాలను విశ్లేషించి ఆ మట్టిలోని పోషక లోపాలు తెలియజేసి, మంచి దిగుబడి సాధించడానికి తీసుకోవలసిన చర్యలను ఈ భూసార పరీక్షా ఫలితా పత్రాలు (SHC) సూచిస్తాయి. వీటి ప్రాధాన్యతను గుర్తెరిగి, తిరిగి ఈ సంవత్సరం నుంచి యుద్ధ ప్రాతిపదికన SHC లను పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది.

2024-25లో 4.50 లక్షల మట్టి నమూనాల విశ్లేషణకు రూ.18.35 కోట్లు లక్ష్యంకాగా, ఇప్పటివరకు 4.15 లక్షల నమూనాలను సేకరించి, 1.21 లక్షల నమూనాలను విశ్లేషించి, 79 వేల మట్టి నమూనాలకు SHC లు జారీ చేశాం.

ఎన్నో ఏళ్ళుగా ప్రయోగశాలల్లో రసాయనాలు మరియు శ్రమతో కూడిన వెట్ కెమిస్ట్రీ పద్ధతిలో మట్టి నమూనాలు విశ్లేషిస్తున్నాము. ఈ అవరోధాల పరిష్కారానికి రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీతో కూడిన డ్రై కెమిస్ట్రీ విధానంతో మట్టి విశ్లేషణలో వినూత్న విప్లవం తీసుకురాబోతున్నాం. ఆల్ఫా స్పెక్ట్రోస్కోపి వినియోగంతో కేవలం ఒకసారి తీసిన మట్టి నమూనాలను ఒక స్పెక్ట్రల్ లైబ్రరీలో భద్రపరుస్తాం. ఉపగ్రహ చిత్రాలతో తదుపరి మట్టి నమూనాల ఫలితాలు రియల్ టైంలో జారీ చేయబడతాయి.ఈ స్పెక్ట్రల్ లైబ్రరీ అభివృద్ధికి వ్యవసాయ శాఖ ప్రాథమిక చర్యలు తీసుకుంటోంది.

అలాగే గ్రామ స్థాయి సాయిల్ ఫెర్టిలిటీ మ్యాపింగ్ కోసం రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీని ఉపయోగించి మొదటి దశ కింద ఒక జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ ప్రణాళిక రూపొందించాం.

ఈ SHC కార్డుల ఆధారంగానే రైతులకు అవసరమైన సూక్ష్మపోషకాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తుంది.

SHC **జారీ కొరకు 2024-25 సం॥లో వార్షిక కార్యాచరణ ప్రణాళిక క్రింద రూ.38.88 కోట్లు ప్రతిపాదించబడింది.**

**సూక్ష్మ పోషకాల పంపిణీ:**

మట్టి విశ్లేషణ ప్రకారం సూక్ష్మ పోషక లోపాలను సవరించడానికి రైతులకు సూక్ష్మ పోషక ఎరువులు అనగా జింక్ సల్ఫేట్, జిప్సం, బోరాన్ రాయితీపై రైతులకు ఇవ్వనున్నాం.

**రాయితీపై విత్తన పంపిణీ:**

నాణ్యమైన విత్తనమే మేలైన దిగుబడికి ముఖ్యం. అందుకని ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను రాయితీపై డి-క్రిషి యాప్ ద్వారా రైతు సేవా కేంద్రాలలో పంపిణీ చేస్తున్నాం. ముఖ్యమైన పంట విత్తనాలతో పాటు, పచ్చిరొట్ట మరియు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కూడా రైతులకు పంపిణీ చేయబడుతున్నాయి. ఏజెన్సీ మండలాల్లోని గిరిజన రైతులకు ప్రత్యేకంగా 90 శాతం రాయితీతో విత్తనాలు సరఫరా చేస్తున్నాం.

విత్తన సరఫరాకు నోడల్ ఏజెన్సీగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ పనిచేస్తుంది.

2024-25 సంవత్సరానికి 10.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలను, రూ.328.75 కోట్ల రాయితీతో పంపిణీకి ప్రణాళిక చేయగా, ఖరీఫ్‌లో రూ.180.61 కోట్ల రాయితీతో 5.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలను మరియు రబీలో నేటివరకు రూ.23.13 కోట్లు రాయితీతో 0.98 లక్షల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశాం.

2024 ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటలకు ప్రత్యామ్నాయ విత్తనాలను రూ.34.24 కోట్ల రాయితీతో 0.51 లక్షల క్వింటాళ్లు రైతులకు అందించాం.

**2024-25 సంవత్సరానికి రాయితీ విత్తన పంపిణీకి రూ.240 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించాం.**

**ఎరువుల సరఫరా:**

మన ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ప్రాధాన్యమిచ్చి వాటి ద్వారా ఎరువుల పంపిణీని చేయాలని విధానపరమైన నిర్ణయం తీసుకుంది.

2024 ఖరీఫ్‌లో రాష్ట్రానికి 15.80 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను సహకార సంస్థలు, రైతు సేవా కేంద్రాలు మరియు ఇతర ఎరువుల వ్యాపారస్థులచే పంపిణీ చేయడమైనది. అలాగే ఈ సంవత్సరం రబీ కాలానికి రాష్ట్రానికి 22.20 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులకు గాను 4.03 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ఏ.పి. మార్క్‌ఫెడ్ ద్వారా పంపిణీ చేశాం.

రాష్ట్రంలో ఎరువుల నిరంతర సరఫరా కోసం, కొరతను నివారించడానికి ఏ.పి.మార్క్‌ఫెడ్ ద్వారా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల బఫర్ స్టాక్‌లను నిర్వహిస్తున్నది.

2024-25లో ఏ.పి. మార్క్‌ఫెడ్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌లలో అనగా సహకార సంస్థలు మరియు రైతు సేవా కేంద్రాలలో మొత్తం 4.94 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ అందుబాటులో ఉంచి, 3.45 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశాం. **2024-25 సంవత్సరానికి ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు రూ.40 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించాం.**

**పొలం పిలుస్తోంది:**

**"శ్రమైక జీవన సౌందర్యానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్"** అన్న శ్రీశ్రీ గారి వ్యాక్యాన్ని మనస్సులో పెట్టుకొని రైతు శ్రమను గుర్తించి పంటల సాగులో ఆధునిక సాంకేతికతను అన్నదాతలకు చేరువ చేయాలని ప్రోత్సహిస్తున్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తలపెట్టిన బృహత్తర కార్యక్రమమే.... **పొలం పిలుస్తోంది**. ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలం బాట పడతారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయడం, వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడం, క్షేత్ర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం, ఎక్కువ నికరాదాయం దిశగా రైతులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు.

ఈ కార్యక్రమాన్ని ఖరీఫ్‌లో 4 నెలలు, రబీ పంట కాలంలో 4 నెలల పాటు నిర్వహిస్తారు.

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక సమాచార పరిజ్ఞానంతో పంటలు పండించడం అనగా వ్యవసాయంలో డ్రోన్లు, మరియు వాటి ఉపయోగాలు, సాంకేతిక అప్లికేషన్స్ CLS & PDSS (Crop Life Systems and Pest & Disease Surveillance System), NPSS (National Pest Surveillance System) పై అవగాహన కల్పించడం జరుగుతుంది.

అంతేకాకుండా వ్యవసాయ శాఖ ద్వారా రైతుల కోసం అమలు చేస్తున్న GAP పొలంబడి, భూసార పరిరక్షణ, రాయితీపై విత్తనాల సరఫరా, గ్రామ స్థాయిలో విత్తనోత్పత్తి, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం (Natural farming) వంటి శాస్త్రీయ అంశాలపై చర్చిస్తారు.

క్షేత్రస్థాయి సందర్శనల సమయంలో పంటలకు సంబంధించిన సమస్యలను విశ్లేషించి శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాధ్యమైన పరిష్కారాలను అందించడంతోపాటు గ్రామసభలో రైతు సమస్యలపై చర్చించి తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటారు. సమస్యలు/ ఫిర్యాదులను ఆయా శాఖల ద్వారా పరిష్కరించలేకుంటే వాటిని ఆయా శాఖల రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతున్నది.

**2024-25 సంవత్సరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం అమలు కోసం రూ. 11.31 కోట్లు RKVY పథకం నుంచి బడ్జెట్ కేటాయించడం జరిగింది.**

**సమీకృత రైతు సమాచార కేంద్రం:** రైతులు నేరుగా తమ సమస్యలు, సందేహాలను టోల్ ఫ్రీ నెం. 155251 కు ఫోన్ చేసి పరిష్కారం తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు 9.52 లక్షల కాల్స్ ద్వారా వచ్చిన సందేహాలను నివృత్తి చేయడం జరిగినది.

**పాడి పంటలు స్టూడియో/ ఛానల్:** 2.89 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్‌తో పాడి పంటలు యూట్యూబ్ ఛానల్‌లో వివిధ పంటలు, సాగు పద్ధతులు, తెగుళ్ళ నివారణపై శాస్త్రవేత్తల సమయానుకూల సలహాలతో కూడిన వీడియోలను రైతులకు పాడి పంటలు స్టూడియో/ ఛానల్ ద్వారా అందించడం జరుగుతున్నది.

**పాడి పంటలు మాసపత్రిక:** ఈ మాస పత్రిక ద్వారా రైతులకు కాలానుగుణంగా వినూత్న సాగు పద్ధతులు, అధిక దిగుబడులకు మెళకువలు, పంటలను ఆశించు చీడ పీడలు వాటి నివారణోపాయాలు శాస్త్రవేత్తలు మరియు అనుభవజ్ఞులైన రైతులతో తెలియజేస్తున్నాం. రైతు సేవ కేంద్రాల ద్వారా 54,738 చందాదారులైన రైతులకు అందజేస్తున్నాం.

**ప్రకృతి వ్యవసాయం:**

ప్రస్తుత వాతావరణంలో వస్తున్న గణనీయమైన మార్పులను నిలువరించడానికి ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని రైతులను చైతన్య పరచడానికి రైతు సాధికార సంస్థ వ్యవసాయ శాఖ సమన్వయంతో అడుగులు వేస్తోంది.

**ఏడాది పొడవునా రైతులు నిరంతర నికరాదాయం పొందేందుకు ప్రకృతి వ్యవసాయం ఒక మేలైన విధానం.** అంతేకాక రసాయన ఎరువుల వాడకం వల్ల తగ్గిన భూసారాన్ని పునర్జీవింప చేసేందుకు సహజ ఎరువుల వాడకంతో రైతులు నాణ్యమైన పంటల దిగుబడి పొందాలనే ఉద్దేశ్యంతో ప్రకృతి వ్యవసాయానికి మా ప్రభుత్వం చేయూతనిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల (APCNF) ద్వారా రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు, వాటి సమాఖ్యలు ఉత్తమ ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించేలా రాష్ట్రంలోని రైతులకు శిక్షణ ఇస్తున్నాం.

ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న వ్యవసాయ– పర్యావరణ విధానాల కంటే మిన్నగా రాష్ట్రంలో APCNFలో వినూత్న సాగు పద్ధతులు అనగా..

PMDS (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్)– వర్షాధార పంటలలో కూడా ఏడాదికి మూడు పంటలు పండించడం,

A –గ్రేడ్ మోడల్ – ప్రధాన పంటల్లో పలు రకాల వైవిధ్యమైన పంటలతో మూడు సీజన్లలోనూ పంటలు పండించే విధానం,

ATM మోడల్ - సన్న, చిన్న కారు రైతులకి, భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఆదాయాలు సమకూర్చే 20 సెంట్ల విధానం,

DrPM మోడల్ (Drought Proofing Model) - సాగుకు యోగ్యం కాని, నిస్సారవంతమైన, బీడు భూములను సాగులోకి తీసుకొని రాగల పద్ధతి.

మార్చి 2024 నాటికి మన రాష్ట్రంలో 658 మండలాల్లో, 4,116 గ్రామ పంచాయతీలలో గల 7,746 గ్రామైఖ్య సంఘాలలోని (VO), 2.31 లక్షల స్వయం సహాయక సంఘాలు (SHG), 10.37 లక్షల వ్యవసాయ కుటుంబాలు 4.86 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తున్నారు.

ఉత్తమ ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబిస్తున్న 8,724 మంది (60% మంది మహిళలు) ఛాంపియన్ రైతులు క్షేత్రస్థాయి శిక్షకులుగా ఉన్నారు. భూమిలేని నిరుపేద కుటుంబాలు 3.52 లక్షల ప్రకృతి వ్యవసాయ పెరటి తోటలను పెంచుతున్నారు.

32వేల మంది సర్టిఫైడ్ ప్రకృతి వ్యవసాయ రైతులు ఉన్నారు. ప్రకృతి వ్యవసాయ గ్రామాలలో 1903 బయో-ఇన్‌పుట్ షాపులు గ్రామ సంఘాల (VOs) సహకారంతో ఏర్పాటయ్యాయి.

2024-25లో APCNFలో 13 లక్షల మంది రైతులచే 6.64 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయ విధానాలు, నిరుపేద రైతుకూలీ కుటుంబాలచే 5 లక్షల పెరటి తోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నాం.

**2024-25 సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయ (APCNF) కార్యక్రమాల అమలు కోసం రూ. 422.96 కోట్లు ప్రతిపాదించాం.**

**వ్యవసాయంలో సాంకేతికత - అగ్రి డీప్-టెక్:**

వ్యవసాయ ఉత్పాదకాల్ని సమర్ధవంతంగా వినియోగిస్తూ, వాతావరణంలో వస్తున్న మార్పుల కనుగుణంగా సాగును మార్చుకుంటూ, తక్కువ పెట్టుబడితో మేలైన దిగుబడులు సాధిస్తూ, రైతులకు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడానికి వ్యవసాయంలో స్మార్ట్ అగ్రికల్చర్ మరియు ప్రెసిషన్ అగ్రికల్చర్ (ఖచ్చితత్వం) విధానాలు తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు కార్యాచరణ చేస్తుంది.

దీనిలో భాగంగా వివిధ వినూత్న సాంకేతిక విధానాలు వ్యవసాయంలోకి ప్రవేశపెట్టడానికి సన్నాహం చేస్తున్నాం.

**రియల్-టైం మద్దతు:** ఉపగ్రహ డేటా, వాతావరణ సమాచారం మరియు పంట స్థాయి ఫీల్డ్ ఇమేజెస్ ద్వారా పంట ఆరోగ్యం, మట్టి తడిమట్టం, చీడ పీడల గురించి తక్షణ సూచనలు అందించడం.

**యూనిఫైడ్ కల్టివేటర్ డేటాబేస్**: ప్రతి రైతు యొక్క వ్యక్తిగత, కుటుంబ, బ్యాంకింగ్ మరియు వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని కలిగి ఉంచుతూ, ప్రభుత్వ పథకాలతో సులభతరంగా అనుసంధానం చేయడం, పర్యవేక్షణను మెరుగుపరచడం.

**ఉన్నత పర్యవేక్షణ మరియు పంట ప్రణాళిక** ద్వారా ప్రభుత్వం మరియు వ్యవసాయ బోర్డులకు పంటల ఆరోగ్యం, దిగుబడి, నాణ్యత, అందుబాటులో ఉన్న వనరులపై సమగ్ర విశ్లేషణ అందించడం.

ఈ సాంకేతికత రైతులు, ప్రభుత్వం, వ్యవసాయ వ్యాపారులు, శాస్త్రవేత్తలకు వ్యవసాయ ఉత్పత్తిని మరియు ఆదాయాన్ని మెరుగుపరచడానికి తగు చర్యలు తీసుకోవడానికి సహాయ పడుతుంది.

**డిజిటల్ వ్యవసాయం:**

రైతులకు అధునాతన సాంకేతిక సేవలను అందించడానికి వ్యవసాయ శాఖ డిజిటలైజేషన్‌కు ప్రభుత్వం కృషి చేస్తోంది.

**ఈ-పంట:** పంట సాగు చేసిన ప్రతి వాస్తవ సాగుదారుని వివరాలు ఈ-పంటలో నమోదవుతాయి. దీని వల్ల అర్హత గల ప్రతి రైతుకు పంటల బీమా, పంటలకు మద్దతు ధర, సంక్షేమ పథకాల లబ్ధి వర్తిస్తుంది.

**APAGRISNET** వెబ్‌సైట్ ద్వారా వ్యవసాయ శాఖకు సంబంధించిన సమగ్ర సమాచారం రైతులకు అందుబాటులో ఉంచబడుతుంది.

**డి-క్రిషి** యాప్ ద్వారా రాష్ట్రంలోని అర్హత గల ప్రతి రైతును ఆధార్‌తో అనుసంధానించిన బయోమెట్రిక్ విధానంలో రాయితీ విత్తన పంపిణీ జరుగుతుంది.

రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు వారి గ్రామంలోనే వ్యవసాయ, అనుబంధ సేవలు సమర్ధవంతంగా అందించేట్లుగా సిబ్బంది పనితీరు పర్యవేక్షించడానికి **PMA యాప్** రూపొందించబడింది.

**CLS& PDSS** యాప్: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతుల పొలాల్లో గమనించిన పురుగులు, తెగుళ్ళ ఉధృతి మరియు పోషకాల లోపాలను అంచనా వేసి నివారణ చర్యలను రైతులకు ఈ యాప్ చేరవేస్తుంది.

దీనికి కృత్రిమ మేధస్సు (AI) / మెషిన్ లెర్నింగ్ (ML) ప్రక్రియలతో వ్యవసాయ శాఖ, ANGRAU శాస్త్రజ్ఞులచే నివారణ చర్యలను రైతులకు తెలుపబడుతుంది.

**అగ్రి-సలహాల పోర్టల్** ద్వారా రైతులు పండించిన పంట యొక్క చీడ పీడల గురించి, వాతావరణంలోని మార్పులకు అనుగుణంగా రైతులు తీసుకోవలసిన చర్యలను వారి సెల్ ఫోన్‌లకు “సందేశం” రూపంలో పంపబడుతున్నాయి. ఈ పోర్టల్ ద్వారా 45 లక్షల మంది రైతులు లబ్ది పొందారు.

**INSIGHT యాప్** ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యత నియంత్రణకు, నమూనాల సేకరణలో పారదర్శకతను మరియు వాటి పరీక్షలపై పర్యవేక్షణ తీసుకొచ్చాం.

అర్హులైన రైతులకు వారి అవసరాలకు తగ్గట్టుగా వివిధ వ్యవసాయ కార్యక్రమాలు, పథకాల ద్వారా సేవలను అందించడానికి వీలుగా ప్రతి రైతుకు ఒక విశిష్ట గుర్తింపు నెంబర్ ఇస్తూ ఫార్మర్స్ రిజిష్ట్రి ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. దీని కోసం **అగ్రిస్టాక్ పథకం** క్రింద డిజిటలైజ్డ్ ల్యాండ్ రికార్డులు మరియు రైతుల విశిష్ట గుర్తింపు ఐడిలతో కూడిన సమగ్ర డేటా బేస్ వ్యవస్థ, జియో-రిఫరెన్స్ చేసిన గ్రామ పటాలు రూపొందిండం వంటి డిజిటల్ సేవలు అందించబడతాయి.

**2024-25సం॥లో డిజిటల్ వ్యవసాయ కోసం రూ.44.77 కోట్లను బడ్జెట్‌తో ప్రతిపాదించాం.**

**వ్యవసాయ యాంత్రీకరణ:**

ప్రతి రంగంలోను స్మార్ట్ వర్క్ చేయడం అనివార్యం, అందుకే వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాముఖ్యం మరియు అవసరం  గుర్తించాం. కూలీల లభ్యత తగ్గడం, వ్యయం పెరగడం వంటి విషయాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రభుత్వం మొదటి నుంచి యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇస్తోంది.

ఇప్పటికే కస్టమ్ హైరింగ్ కేంద్రాలు ఆర్.ఎస్.కేలకు అనుసంధానం చేసి అద్దె ప్రాతిపదికన గ్రామంలోని రైతులకు వ్యవసాయ యంత్ర సేవలు అందిస్తూ ఉండగా రైతుల కోరిక మేరకు 2024-25 సంవత్సరంలో 50శాతం సబ్సిడీపై చిన్న, సన్నకారు రైతులకు వ్యక్తిగత వ్యవసాయ యంత్రాలు మరియు పనిముట్లను అందించబోతున్నాం. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా  హై కాస్ట్ మెషినరీ కస్టమ్ హైరింగ్ సెంటర్లను నెలకొల్పి దీని ద్వారా అద్దె ప్రాతిపదికన యంత్రాలను ఇవ్వడానికి ప్రతిపాదించాం. ఈ కార్యక్రమాల అమలు కొరకు  రూ.152.68 కోట్లు రాయితీ నిధులు ప్రతిపాదించాం.

**వ్యవసాయంలో నవశకానికి నాంది ... కిసాన్ డ్రోన్లు ...**

వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు రైతులకు చేరువ చేయాలని అందుకు అనుగుణంగా ఈ ఏడాది వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ప్రవేశపెడుతున్నాం. పురుగుమందులు, కలుపు మందుల పిచికారీ డ్రోన్లతో చేయడం వల్ల మందుల వినియోగ పరిమాణం 25 శాతం తగ్గుతుంది. దీనివల్ల రైతులకు ఖర్చు తగ్గి నికరాదాయం పెరుగుతుంది. డ్రోన్ల సాయంతో పంటల సస్యరక్షణ తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టవచ్చు. విత్తనాలు, ఎరువులు వెదజల్లడానికి కూడా డ్రోన్లు ఉపయోగించవచ్చు. 3 సంవత్సరాలలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో డ్రోన్‌ల సేవలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

తొలిదశలో 2024-25 సం॥లో రూ. 87.50 కోట్ల విలువ గల డ్రోన్లతో కూడిన 875 యంత్ర సేవా కేంద్రాలను 40 శాతం రాయితీపై ఏర్పాటు చేయనున్నాం.వీటి నిర్వహణ కోసం సి. హెచ్.సి. రైతులు, గ్రామీణ యువతకు డ్రోన్ పైలట్ శిక్షణ అందిస్తున్నాం. దీనితో గ్రామాల్లోని యువతకు కూడా ఉపాధి లభిస్తుంది. రైతులకు డ్రోన్ పైలెట్ శిక్షణను ప్రభుత్వ వ్యయంతో డైరెక్టరేట్ జనరల్ అఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) ధృవీకరించిన శిక్షణా సంస్థలైన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు డ్రోగో డ్రోన్ సంస్థ ద్వారా అందిస్తున్నాం. 2024-25 సం॥లో బడ్జెట్‌లో డ్రోన్ల సాంకేతికత ప్రోత్సాహానికి రూ. 35 కోట్ల రాయితీ నిధులతో ప్రణాళిక చేశాం.

**2024-25 సం॥లో బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 187.68 కోట్లు ప్రతిపాదించాం.**

**వ్యవసాయ ఋణాలు:**

2024-25సం॥లో, ప్రభుత్వం వ్యవసాయ ఋణాల కోసం రూ. 2,64,000 కోట్లు (పంట ఋణాల కింద రూ. 1లక్ష 66 వేల కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల కింద రూ. 98 వేల కోట్లు) అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఇప్పటివరకు పంట ఋణాల కింద రూ. 1,03,649 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలతో సహా వ్యవసాయ టర్మ్ ఋణాల కింద రూ. 66148 కోట్లు మొత్తం రూ. 1,69,797 కోట్లు పంపిణీ చేయబడ్డాయి.

కౌలు రైతులకు ఈ ప్రభుత్వం 9.08 లక్షల పంట సాగుదారుల హక్కుల కార్డ్‌లను (CCRCలు) జారీ చేసింది. తద్వారా కౌలు రైతులకు 11 నెలల పాటు పంటపై హక్కులను కల్పించడం, పంట ఋణాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందేందుకు వీలు కల్పించింది.

2024-25సం.లో CCRCలు పొందిన కౌలు రైతులకు రూ.1443 కోట్ల పంట ఋణాలు పంపిణీ చేశాం.

**ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం 2024:** అర్హత కలిగిన కౌలుదారుల గుర్తింపులో సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు, ఎలాంటి అవాంతరాలు లేకుండా వారికి పంట ఋణాలు, అలాగే అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి, అర్హులైన కౌలు దారులందరికీ కౌలుదారు గుర్తింపు కార్డులను జారీ చేసేందుకు 2024లో కొత్త సాగుదారుల హక్కుల చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ చట్టాన్ని ఖరారు చేయడానికి  కౌలు రైతులు, భూయజమానులు మరియు సంబంధిత అధికారుల  నుండి అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాల్లో ఏడు ప్రాంతీయ సమావేశాలను నిర్వహించాలని ప్రణాళిక చేసింది. అక్టోబర్ 7 మొదలుకుని ఇప్పటివరకు ఐదు సమావేశాలు జరుగగా, మిగతా రెడు ప్రాంతీయ సమావేశాలను త్వరలో నిర్వహిస్తాం.

**వడ్డీ లేని ఋణాలు మరియు పావలా వడ్డీ ఋణాలు:**

రూ.3 లక్షల వరకు పంట ఋణాలు పొంది, నిర్ణీత వ్యవధి అనగా ఒక సంవత్సరంలో తిరిగి చెల్లించే అర్హులైన రైతులందరికీ 2024-25 నుండి "వడ్డీ లేని ఋణాలు మరియు పావలా వడ్డీ" పథకం కింద వడ్డీ రాయితీ అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. వడ్డీ రాయితీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడుతుంది.

చిన్న, సన్నకారు రైతులతో పాటు వాస్తవ సాగుదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించడం, రైతులను అప్పుల ఊబిలో పడకుండా కాపాడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం.

ఈ పథకం రైతులలో ఆర్థిక క్రమశిక్షణ తీసుకురావడమే కాకుండా వారిని వడ్డీ వ్యాపారస్తుల బారి నుండి  కాపాడుతుంది.

3 లక్షల వరకు పంట ఋణం తీసుకుని సంవత్సరంలోగా చెల్లించిన రైతులకు ...

వడ్డీ లేని ఋణాలు  పథకం కింద రూ.1 లక్ష వరకు పంట ఋణ మొత్తంపై 4శాతం వడ్డీ రాయితీ,

పావలా వడ్డీ ఋణాల పథకం కింద రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు పంట ఋణ మొత్తంపై 1శాతం వడ్డీ రాయితీని అందజేస్తుంది.

**2024-25 సం.లో వడ్డి లేని ఋణాలు పథకాన్ని అమలు చేయదానికి బడ్జెట్లో రూ.628 కోట్లు ప్రతిపాదించబడింది.**

**అన్నదాత సుఖీభవ- పి.ఎమ్.కిసాన్:**

సంకీర్ణ ప్రభుత్వం "సూపర్ సిక్స్" కార్యక్రమం కింద రైతులకు "అన్నదాత సుఖీభవ-పిఎమ్.కిసాన్" పథకంలో సంవత్సరానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. (పి.ఎమ్.కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం అందించే రూ.6000 ప్రయోజనంతో కలిపి).

రాష్ట్రంలోని భూమిలేని సాగుదారులందరికీ ఆర్థిక సహాయం సంవత్సరానికి రూ.20 వేల చొప్పున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు నుండి అందించబడుతుంది.

పథకం విధివిధానాలు, మార్గదర్శకాలపై ప్రభుత్వ ఆదేశాలు త్వరలో జారీ చేయబడతాయి. **ఈ పథకం అమలుకు రూ.4,500 కోట్లు ప్రతిపాదించాం.**

**రైతు సేవా కేంద్రాలు (RSK):**

రైతుల ఆర్థిక, జీవనోపాధిని మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో 10778 రైతు సేవా కేంద్రాలను గ్రామ స్థాయిలో నెలకొల్పబడి నిపుణులైన వి.ఏ.ఎ./ వి.హెచ్.ఎ/వి.ఎస్.ఎ. మరియు వి.ఎ. హెచ్. ఎ /వి.ఎఫ్.ఎ ల ద్వారా నిర్వహించబడుచున్నవి.

గ్రామ స్థాయిలోనే రైతుకు కావలసిన అన్ని సేవలు అనగా విత్తనాల సరఫరా, మట్టి పరీక్షలు, ఈ-పంట నమోదు, వ్యవసాయ యాంత్రీకరణ, కౌలుదారు హక్కు పత్రాలు, పొలం పిలుస్తోంది, పంట నష్ట పరిహారం, లబ్ధిదారుల సామాజిక తనిఖీ, పంటల బీమా, పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణలు మొదలగు సేవలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించడం జరుగుతోంది.

**ఆర్.ఎస్.కెలకు శాశ్వత భవనాలు:** రైతు సేవా కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను కేటాయిస్తూ 10,252 భవనాలను మంజూరు చేయడమైనది. దీనిలో భాగంగా 4865 భవనాలు పూర్తయ్యి రైతులకు కావలసిన సేవలను గ్రామ స్థాయిలో అందిస్తున్నాయి.

**రైతు సేవా కేంద్రాల నిర్వహణ కొరకు 2024-25 బడ్జెట్‌లో రూ.26.92 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.**

**ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్:**

రైతులు వినియోగించే ఉత్పాదకాల నాణ్యతా ప్రమాణాలు ధృవీకరించి, వీటి సేవలను రైతులకు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఏర్పడినవే ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్. నియోజకవర్గ స్థాయిలో 147 ల్యాబ్స్, జిల్లా స్థాయిలో 9 ల్యాబ్స్ మరియు 4 రీజనల్ కోడింగ్ సెంటర్ల నిర్మాణం చురుగ్గా పూర్తవుతోంది. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో 113 ప్రయోగశాలలు సేవలు అందిస్తుండగా మిగిలినవి వచ్చే ఖరీఫ్ 2025 పంటకాలానికి అందుబాటులోకి రానున్నాయి.

**ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ కోసం 2024-25 బడ్జెట్‌లో రూ. 44.03 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.**

**పంటల బీమా (PMFBY):**

వ్యవసాయాధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తుఫానులు, కరువులు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా దిగుబడి గణనీయమైన నష్టాలను ఎదుర్కొంటోంది.

వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాల వలన కూడా రైతులపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోంది. పంటల బీమా ఈ అనూహ్య నష్టాల నుండి రైతులను కాపాడుతూ అవసరమైన ఆర్థిక రక్షణను అందిస్తుంది.

పంటల బీమా యొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తూ, పథకం అమలును సమీక్షించడానికి, మార్పులను సిఫార్సు చేయడానికి గౌరవనీయులైన వ్యవసాయ, ఆర్థిక మరియు పౌర సరఫరాల మంత్రులతో ముగ్గురు సభ్యుల క్యాబినెట్ సబ్‌కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారి సూచనల ఆధారంగా, ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY), పునర్ వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (RWBCIS) కి కీలక మార్పులు చేయబడ్డాయి. ఈ రెండు పథకాలు ఇప్పుడు ఖరీఫ్ మరియు రబీ సీజన్లలో అమలు చేయబడుతున్నాయి.

ఖరీఫ్ 2024 సీజన్లో, ఈ-పంట నమోదు ఆధారంగా ఉచిత బీమాను వర్తింప జేయడం జరిగింది. రబీ 2024-25 నుండి, రైతులకు వారి వారి అవసరాల మేరకు పథకంలో పాల్గొనే స్వేచ్ఛ, సౌలభ్యాన్ని అందించే స్వచ్ఛంద నమోదు విధానం తిరిగి ప్రవేశపెట్టబడింది. దీని కొరకు, రైతులు నామమాత్రపు ప్రీమియం చెల్లించవలసి వస్తుంది. ఖరీఫ్ పంటలకు 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం, వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం, రైతులు చెల్లిస్తే మిగిలిన ప్రీమియాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లించడం జరుగుతుంది. బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేయబడిన బీమా కంపెనీల క్లైయిమ్‌లను చెల్లించడం జరుగుతుంది.

జిల్లా స్థాయిలో కనీసం 2000 హెక్టార్లలో విస్తరించి ఉన్న అన్ని ప్రధాన పంటలు ఈ పథకంలో చేర్చబడ్డాయి. ఖరీఫ్ 2024 కోసం, 22 పంటలు (PMFBY కింద 15మరియు RWBCIS కింద 7 పంటలు) కవర్ చేయబడ్డాయి, రబీ 2024-25కి 15 పంటలు (PMFBY కింద 13 మరియు RWBCIS కింద 2 పంటలు) నోటిఫై చేయబడ్డాయి. 2024-25 రబీ నుండి మామిడి పంటను కూడా ఈ పథకంలో తిరిగి ప్రవేశపెట్టడం జరిగింది, ఇది ఉద్యాన రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది.

ఉపగ్రహ సాంకేతికత (YES -టెక్) ఆధారంగా వరి పంట దిగుబడి అంచనా వేసే వ్యవస్థను ఉపయోగించడమనే ఒక కీలకమైన పురోగతి సాధించడం జరిగింది. ఇది దిగుబడులను అంచనా వేయడానికి, క్లెయిమ్ పరిష్కారాలను వేగవంతం చేయడానికి ఉపగ్రహ డేటాను ఉపయోగిస్తుంది. YES-టెక్ కింద, శాటిలైట్-ద్వారా వచ్చిన దిగుబడి అంచనాలకు 30 శాతం మరియు సాంప్రదాయ పద్ధతుల ద్వారా వచ్చిన దిగుబడికి 70 శాతం వెయిటేజీ ఇవ్వడం జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని అహ్మదాబాద్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, మరియు AP స్పేస్ అప్లికేషన్ సెంటర్ భాగస్వామ్యంతో నంద్యాల, కాకినాడ జిల్లాల్లో ఖరీఫ్, రబీ 2024-25 మరియు 2025-26లో అమలు చేయబడుతోంది.

పథకం గురించి రైతులకు అవగాహన కల్పించడానికి, పంట బీమా ప్రయోజనాల గురించి రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది.

**పంటల బీమా పథకం సజావుగా అమలు చేసేందుకు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1023 కోట్ల కేటాయింపును ప్రభుత్వం ప్రతిపాదించింది.**

**జి.ఎ.పి.పొలంబడి మరియు ఇండ్.గ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమం:**

వ్యవసాయంలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి, ఉత్తమ వ్యవసాయ పద్ధతులను రైతులతో ఆచరింప చేసి, తద్వారా నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పండించి, రైతులు బహిరంగ మార్కెట్లో అమ్ముకునేందుకు వెసులుబాటు కల్పించే కార్యక్రమమే ఇండ్.గ్యాప్ సర్టిఫికేషన్.

ఈ కార్యక్రమం ద్వారా, వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గటంతో పాటు, నాణ్యమైన అధిక దిగుబడి పెరుగుతుంది. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ఆహార భద్రతా ప్రమాణాలు కలిగియుండటంతో పాటు, నాణ్యతలో అంతర్జాతీయ మార్కెట్ నందు గట్టి పోటీ ఇవ్వటం మరియు ఈ ఉత్పత్తులను రైతు ఉత్పత్తిదారుల సంఘాల (FPO) ద్వారా ONDC డిజిటల్ మార్కెట్ ద్వారా అధిక ధరకు అమ్ముకునే అవకాశాలు ఉండటంతో ఈ కార్యక్రమం బహుళ ప్రయోజనం పొందింది.

2023-24 సంవత్సరంలో రూ.2.05 కోట్ల వ్యయంతో 1104 జి.ఎ.పి. పొలంబడులను నిర్వహించగా, అందులో రూ.23 లక్షలతో ఇండ్.గ్యాప్ సర్టిఫికేట్‌ను పైలట్‌గా నిర్వహించి, 37 FPOల ద్వారా 37 ఇండ్.గ్యాప్ స్కోప్ సర్టిఫికేట్లను సాధించటం జరిగింది. తద్వారా 77.09 లక్షల రూపాయల అదనపు ఆదాయం రైతులకు లభించింది.

2024-25సం॥లో రూ.10.61 కోట్లతో ప్రతి మండలంలో ఇండ్.గ్యాప్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను నిర్వహించి 154 FPO ల ద్వారా అమలు చేయుటకు ప్రణాళికను తయారు చేసి, 26 జిల్లాలలో 1300 ఇండ్.గ్యాప్ కార్యక్రమాలను 40వేల మంది రైతులతో నిర్వహిస్తున్నాం.

**ప్రకృతి వైపరీత్యాలు (ఇన్‌పుట్ సబ్సిడీ):**

వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాలను పర్యవేక్షించడానికి, అంచనా వేయడానికి, నష్టపోయిన రైతులను గుర్తించడానికి రియల్ టైమ్ డేటాను సేకరించడానికి ఈ-పంట యాప్ / వెబ్ అప్లికేషన్‌ను ఉపయోగించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది.

2024 ఆగష్టు /సెప్టెంబర్ మాసాల్లో సంభవించిన భారీ వర్షాలు, వరదల వలన పంటలు నష్టపోయిన వాస్తవ సాగుదారులకు తక్షణ సహాయం అందించడం కోసం గౌరవ ముఖ్యమంత్రి సెప్టెంబర్ 23న జి.ఓ.ఎమ్.ఎస్.నెం.13 ద్వారా నష్ట పరిహార సాయాన్ని పెంచుతూ (ఉదా: వరి పంటకు గతంలో హెక్టారుకు రూ.17వేలు నుంచి రూ.25 వేలకు పెంచాం) ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు.

ఈ-పంట యాప్ / వెబ్ అప్లికేషన్ ద్వారా పెట్టుబడి రాయితీ మొత్తం రూ.284.56 కోట్లు రాష్ట్రంలోని 21 జిల్లాలలో వ్యవసాయ పంటలు నష్టపోయిన 1.90 లక్షల మంది రైతుల ఆధార్ లింక్ ఖాతాలకు నేరుగా బదిలీ చేశాం.

2024 జులైలో భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన 4 జిల్లాల్లోని 23,259 మంది పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన పెట్టుబడి రాయితీ రూ.25.75 కోట్లు (ఎస్.డి.ఆర్.ఎఫ్) త్వరలో అందుతుంది.

2024 ఖరీఫ్ లో, 5 జిల్లాల్లోని 54 మండలాలను కరువు మండలాలుగా గుర్తించాం. వీటిలో అన్నమయ్య (19), చిత్తూరు (16), శ్రీ సత్యసాయి(10), అనంతపురం(7), కర్నూలు (2) మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది.

***రైతు సంక్షేమానికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కీలకంగా నిలుస్తున్న వ్యవసాయ శాఖకు 2024-25 వార్షిక బడ్జెట్‌లో మొత్తం రూ.8564.37 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.***

**2. ఉద్యానశాఖ:**

అధ్యక్షా !

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన రైతులకు మెరుగైన ధర లభించుట, మార్కెటింగ్ సౌకర్యాలు,ఉద్యాన పంటల ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యతను పెంచే లక్ష్యంతో ఉద్యాన రంగాన్ని ప్రాధాన్యత కలిగిన శాఖగా గుర్తించింది. రాష్ట్రంలో ఉద్యాన పంటలు 45.57 లక్షల ఎకరాలలో సాగు చేస్తూ 366.49 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదు చేయడం జరిగింది. దేశ పండ్ల ఉత్పత్తిలో మన రాష్ట్రం 15.60 శాతం వాటాతో ప్రథమ స్థానంలో నిలిచింది.

2024-25 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తర్వాత సూక్ష్మసేద్యం అమలులో నాల్గవ స్థానంలో ఉంది. దేశంలోనే అత్యుత్తమ 15 జిల్లాలలో 6 జిల్లాలు (ప్రకాశం, అనంతపురము, వై.ఎస్.ఆర్, అన్నమయ్య, శ్రీ సత్యసాయి మరియు కర్నూలు) ఆంధ్రప్రదేశ్‌కి చెందినవి కావడం గర్వించదగ్గ విషయం.

2024-25 సంవత్సరానికి గాను, సూక్ష్మసేద్యం కింద 3 లక్ష హెక్టార్లను తీసుకురావడానికి రూ.2700 కోట్లతో RKVY-PDMC కింద కేంద్రప్రభుత్వానికి కార్యాచరణ ప్రణాళిక పంపబడింది. ఈ సంవత్సరంలో 3,03,689 హెక్టార్లలో సూక్ష్మసేద్యం కోసం రిజిస్ట్రేషన్లు, 82,325 హెక్టార్లలో BOQ లు పూర్తయ్యాయి.

మన రాష్ట్రం ఆయిల్ పామ్ విస్తీర్ణం 2.27 లక్షల హెక్టార్లతో, ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.

2024-25 సంవత్సరానికి, 35వేల హెక్టార్ల లక్ష్యంతో ఆయిల్‌పామ్ తోటల సాగుకు రూ.261.53 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. క్రాప్ డైవర్సిఫికేషన్ లో భాగంగా ఇతర సాంప్రదాయ పంటల నుండి ఆయిల్ పామ్ సాగు చేపట్టడం వలన ఈ సంవత్సరం ఇప్పటివరకు, అదనంగా 17,907 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు తీసుకురావడం జరిగింది.

2024-25 సంవత్సరానికి గాను సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం (MIDH) కింద రూ.337.41 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. పంట కోత అనంతర నష్టాలను నివారించటం కోసం రాష్ట్రంలో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌లు మంజూరు చేయడం జరిగింది. ఇవి రైతులకు వారి ఉత్పత్తులను ఒకచోట సమీకరించుకోవటానికి, మధ్య దళారుల బారి నుండి తప్పించి మంచి ధరకు అమ్ముకునే వెసులుబాటు కలిగింది.

నేషనల్ బ్యాంబూ మిషన్ పథకం ద్వారా వెదురు మొక్కల పెంపకం, నర్సరీస్ మరియు వెదురుతో వస్తువులు తయారు చేసి తద్వారా ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడం జరుగుతుంది. ఈ పథకం కింద 2024-25 సంవత్సర వార్షిక ప్రణాళికలో రూ. 0.50 కోట్లు ప్రతిపాదించడమైనది.

రైతులకు నాణ్యమైన మొక్కల సరఫరా చేసేందుకు మన ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ హార్టీకల్చర్ నర్సరీల (నియంత్రణ) చట్టం 2010" సవరించి, 3,171 నర్సరీలు నమోదు చేశాం.

గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (GAP), సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా 13 రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఎంపిక చేసుకొని మామిడి, అరటి, పసుపు, మిరప, కూరగాయల్లో నాణ్యతా ప్రమాణాలను పెంపొందిస్తున్నాం. సంవత్సరం ఈ పథకం ద్వారా 2534 ఎకరాల విస్తీర్ణంలో 1051 మంది రైతులకు సహకారం అందిస్తాం.

క్షేత్ర సందర్శనల ద్వారా పంటల పరిస్థితి, చీడ పీడల ఉధృతిని నిరంతరం పర్యవేక్షణ జరుగుతోంది. కొబ్బరి, ఆయిల్ పామ్‌పై త్రిప్స్, రుగోస్ స్పైరలింగ్ తెల్ల ఈగ ఉధృతిని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

ఎగుమతుల అభివృద్ధి కోసం ఇప్పటివరకు 19,678 మంది రైతులు APEDA హార్టీ-నెట్ పోర్టల్‌లో నమోదు చేశాం.

2024 ఆగష్టు-సెప్టెంబర్ మధ్యకాలంలో సంభవించిన భారీ వర్షాలు మరియు వరదల కారణంగా ఉద్యాన పంటలు దెబ్బతిన్న 16791 మంది ఉద్యాన రైతులకు DBT ద్వారా అతి తక్కువ సమయంలో రూ. 34.52 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశాం.

క్రాప్ బుకింగ్, గణన, పంట పరిస్థితులపై నిఘా కోసం డిపార్ట్‌మెంట్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు ఆవిష్కరణలను కూడా ఉపయోగిస్తోంది.

ONDC ప్లాట్‌ఫారమ్ ద్వారా ఉద్యాన ఉత్పత్తులు, రైతు ఉత్పత్తి దారుల సంఘాలను ఆన్‌బోర్డింగ్ చేసి మార్కెటింగ్‌ను ప్రోత్సహించి 100 ఉద్యాన ఉత్పత్తులు రిజిస్టర్ చేసి 294 డిజిటల్ లావాదేవీలు జరిపాం.

"స్వర్ణాంధ్ర 2047" క్రింద 11ఉద్యాన పంటలను క్లస్టర్ విధానంలో ప్రోత్సహిస్తున్నారు. ఉద్యాన పంటలలో నాణ్యమైన మొక్కలు సరఫరా చేసి ఉత్పాదకత, నాణ్యత మరియు నికర రాబడిని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. కోత అనంతర నష్టాలను తగ్గించడానికి పోస్ట్- హార్వెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రాసెసింగ్ సదుపాయాలను కల్పించడానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడమైనది.

**2024-25 సంవత్సరంలో ఉద్యానశాఖ ప్రతిపాదనలు:**

పంటల వైవిధ్యం ద్వారా సాంప్రదాయ వ్యవసాయ పంటల నుండి 1,73,900 ఎకరాలు వాణిజ్య ఉద్యాన పంటల కిందకు తీసుకురావడం. బహుళ అంతస్థుల పంటలు, అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా ఉద్యాన పంటల ఉత్పత్తి, ఉత్పాదకత & నాణ్యతను పెంచడం.

సూక్ష్మసేద్యం కింద అదనంగా 7.50 లక్షల ఎకరాలను తీసుకురావడం. ప్రభుత్వ ఉద్యాన నర్సరీలలో 7.69 లక్షల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కుప్పం నుండి నాణ్యమైన 20 లక్షల గ్రాఫ్టెడ్, 67 లక్షల నాన్-గ్రాఫ్టెడ్ మొక్కల ఉత్పత్తి మరియు సరఫరా చేయడం.

పంట తర్వాత వచ్చే నష్టాలను తగ్గించడానికి రైపనింగ్ చాంబర్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, ప్యాక్ హౌసులు, గ్రేడింగ్, సార్టింగ్, ప్యాకింగ్ కోసం శీతల గదులు వంటి మౌలిక సదుపాయాల కల్పన.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి బలోపేతం చేయడం మరియు ఉద్యాన ఉత్పత్తులను మార్కెట్‌లు, కార్పొరేట్‌లకు అనుసంధానం చేయడం. క్లస్టర్ల అభివృద్ధి, అధిక దిగుబడినిచ్చే రకాలను పరిచయం చేయడం మరియు ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడం.

2024-25 ఆర్థిక సంవత్సరంలో, సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం కింద ఉద్యానపంటల సమగ్ర అభివృద్ధికి రూ. 337.41 కోట్లు ప్రతిపాదించబడింది.

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (NMEO-OP) ఆయిల్ పామ్ పథకం కింద, పామ్ ఆయిల్ మొక్కలను హెక్టారుకు రూ. 12 వేల నుంచి రూ. 29 వేల వరకు రాయితీని గణనీయంగా పెంచాం. అదేవిధంగా నిర్వహణ ఖర్చు, అంతర పంటల ప్రోత్సాహం కోసం రాయితీ ఇస్తున్నాం. పాత తోటల పునరుద్ధరణలో భాగంగా పాత తోటలలో మళ్లీ మొక్కలు నాటేందుకు ఒక్కో మొక్కకు రూ. 250/- చొప్పున ప్రత్యేక సహాయం అందజేస్తున్నాం. ఈ **పథకం కింద పామాయిల్ తోటల పెంపకానికి 2024-25 సంవత్సరానికి గాను రూ.373.93 కోట్లు ప్రతిపాదించబడింది.**

సూక్ష్మసేద్యం అవసరమున్న ప్రతి రైతుకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్స్ పరికరాలు సరఫరా చేయుటకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. తద్వారా, ఉత్పత్తి, ఉత్పాదకత మరియు నాణ్యత పెంచటము జరుగుతుంది, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (RKVY-PDMC) పథకం కింద సూక్ష్మసేద్య పరికరాలను రాయితీపై అందించడానికి రూ. 2700 కోట్లతో వార్షిక ప్రణాళిక ప్రతిపాదించడమైనది.

2024-25 సం॥నికి రాష్ట్ర అభివృద్ధి పథకం క్రింద రూ. 9.01 కోట్లు కేటాయించడమైంది.

2024-25 సంవత్సరానికి కొబ్బరి అభివృద్ధి పథకం క్రింద కొబ్బరి చెట్ల బీమా కొరకు రాష్ట్ర వాటాగా 2.50 లక్షల కేటాయించడమైంది.

**2024-25 సంవత్సరానికి గాను ఉద్యానశాఖకు రూ.3469.47 కోట్ల బడ్జెట్ ను ప్రతిపాదిస్తున్నాం.**

### 3. పట్టుపరిశ్రమ శాఖ

పట్టుపరిశ్రమ అనేది మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం మరియు సిల్క్ రీలింగ్‌తో వ్యవహరించే ఒక మంచి వ్యవసాయ పద్ధతి.

రాష్ట్రంలో దాదాపు 80,550 మంది రైతులు 1.49 లక్షల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తూ, పట్టు పరుగుల పెంపకం, 600 సిల్క్ రీలర్ కుటుంబాలు 367 సిల్క్ రీలింగ్ యూనిట్లలో ముడి పట్టును ఉత్పత్తి చేస్తున్నారు.

తీవ్రమైన వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడానికి ముఖ్యంగా కరువు పీడిత ప్రాంతాలలో ఇతర వాణిజ్య పంటలకు ఉత్తమ ప్రత్యామ్నాయాలలో పట్టుపరిశ్రమ పంట ఒకటి. ఎందుకంటే వరి లేదా ఇతర వాణిజ్య పంటలతో పోల్చినప్పుడు మల్బరీ మొక్క చాలా తక్కువ నీటితో సాగుచేయబడుతుంది.

పట్టు రైతులకు ఒక ఎకరాకు సంవత్సరానికి సగటు ఆదాయం రూ. 1.50 లక్షలు వస్తుంది.

భారతదేశంలో రెండవ అతిపెద్ద ముడి పట్టు ఉత్పత్తిదారు రాష్ట్రంగా మరియు భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ నుండి బెస్ట్ బైవోల్టైన్ ప్రాక్టిసింగ్‌గా అవార్డును సాధించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యందు మల్బరీ మరియు తస్సార్ సిల్క్ రెండూ ఉత్పత్తి చేయబడతాయి.

రాష్ట్రం ప్రైవేట్ రంగంలో (8) ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాలను ఏర్పాటు చేయడం జరిగింది మరియు 3A మరియు అంతకంటే ఎక్కువ అంతర్జాతీయ గ్రేడ్ బైవోల్టైన్ ఉత్పత్తి చేయబడుతుంది.

పట్టుపరిశ్రమ రైతులకు, సిల్క్ రీలర్లకు అధిక రాబడి గల పంట. రాష్ట్రం యందు (6) కొత్త ఆటోమేటిక్ రీలింగ్ మెషినరీ యూనిట్లను మంజూరు చేయడం జరిగింది, గ్రౌండింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. పట్టుపరిశ్రమ రైతులు, సిల్క్ రీలర్లకు గూళ్ళు న్యాయమైన, లాభధాయకమైన ధరలను నిర్ధారించడానికి, రాష్ట్రం ప్రభుత్వ గూళ్ళు మార్కెట్‌లలో ఇ-మార్కెటింగ్‌ను అమలు చేస్తోంది.

రాష్ట్ర అభివృద్ధి పథకం (SDP) తో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాలైన సిల్క్ సమగ్ర, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన RKVY - RAFTAAR, MG-NREGS పథకాలను కూడా పట్టుపరిశ్రమ రైతుల కోసం ఉపయోగించుకుంటుంది.

ఈ సంవత్సరంలో 15 వేల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటివరకు 3789 ఎకరాలలో కొత్తగా మల్బరీని సాగుకు తీసుకువచ్చారు.

2024-25లో ఇప్పటివరకు పట్టు రైతులు 37.294 మెట్రిక్ టన్నులు పట్టు గూళ్ళు (కకూన్స్) ఉత్పత్తి చేశారు. వీటి విలువ రూ.1480.57 కోట్ల మరియు సిల్క్ రీలర్లు రూ.1591.00 కోట్ల విలువైన 5,134 మెట్రిక్ టన్నులు నాణ్యమైన ముడి పట్టును ఉత్పత్తి చేశారు.

పట్టుపరిశ్రమ ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.987 కోట్ల GVA జోడించింది.

ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగ మరియు షెడ్యూల్డ్ కుల కుటుంబాల సాధికారత కోసం పట్టు పరిశ్రమ పథకాలను 90 శాతం రాయితీతో అమలు చేస్తోంది.

**2024-25 ఆర్థిక సంవత్సరానికి పట్టుపరిశ్రమ అభివృద్ధి కోసం 108.4429 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు.**

**4. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ:**

అధ్యక్షా !

రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చిన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాల క్రమబద్ధీకరణ రైతుల వారి ఉత్పత్తులను లాభధాయక ధరకు విక్రయించునట్లుగా చేయటమే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ యొక్క ఉద్దేశ్యం. రాష్ట్రంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు 218 వ్యవసాయ మార్కెట్ కమిటీలు (AMC) ఉన్నాయి. వీటిలో 9.85 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో 1063 గోడౌన్లు ఉన్నాయి.

**ఈ-నామ్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 33 వ్యవసాయ మార్కెట్లలో ఈ-నామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్) అమలు చేయబడుతోంది. ఈ-నామ్ మార్కెట్ల ద్వారా ఆరంభం నుండి ఇప్పటివరకు రూ.53,464.55 కోట్లు వాణిజ్య విలువ గల 81.06 లక్షల మెట్రిక్ టన్నుల వాణిజ్య పరిమాణం వ్యాపార లావాదేవీలు జరిగాయి.

**ధరల స్థిరీకరణ నిధి (పి.యస్.ఎఫ్.):** ఈ ధరల స్థిరీకరణ నిధి ద్వారా కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముడవుతున్న వ్యవసాయ పంటలకు మార్కెట్ జోక్యాన్ని (market intervention) అందించడానికి ఉద్దేశించబడింది.

అలాగే, కనీస మద్దతు ధర లేని మరియు సాధారణ ధర కంటే చాలా తక్కువగా విక్రయించబడుతున్న పంటలకు మార్కెట్ జోక్యాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

**సి.యమ్.యాప్** (CM APP): ఈ యాప్ ద్వారా ప్రతిరోజూ ప్రతి రైతు సేవ కేంద్రం (ఆర్.ఎస్.కె) నుండి వ్యవసాయ ధరలను సేకరిస్తున్న దేశంలోని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

ఇది వ్యవసాయ ధర మరియు సేకరణ యొక్క నిరంతర పర్యవేక్షణను సూచిస్తుంది. ఈ యాప్ ద్వారా ప్రతిరోజూ ధరలు సేకరిస్తారు మరియు అవసరమైన చోట మార్కెట్ జోక్యం చేసుకుంటారు.

**రైతుబజార్లు:** మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా కూరగాయలను విక్రయించడం మరియు వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన / వ్యవసాయ తాజా కూరగాయలను అందించాలనే లక్ష్యంతో రైతు బజార్లు స్థాపించబడ్డాయి.

రాష్ట్రంలో మొత్తం 121 రైతు బజార్లు ఉన్నాయి, మరో 29 రైతు బజార్ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి, వీటిలో 73 రైతు బజార్లు స్వయం సమృద్ధిగా ఉన్నాయి.

**2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఆవిష్కరణలు, సంస్కరణలు మెరుగుదలలు:**

మార్కెటింగ్ శాఖ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంపొందించడానికి మరియు నగదు రహిత లావాదేవీల ద్వారా చెక్ పోస్టులలో అక్రమాలకు మరియు అవకతవకలకు ఆస్కారం లేకుండా చేయడానికి ఎండ్ టు ఎండ్ డిజిటలైజేషన్.

రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌలభ్యం కోసం గిడ్డంగులను మార్కెట్‌లుగా ప్రకటించడం.

రైతుల ఉత్పత్తులకు నిజమైన ధరను కనుగొనడం కోసం, పోటీని పెంచడం కోసం దేశవ్యాప్తంగా భారత ప్రభుత్వ ఈ-నామ్ ప్లాట్ ఫారమ్‌తో హోల్‌సేల్ మార్కెట్‌ల ఏకీకరణ.

రైతు ఉత్పత్తి దారుల సంఘాలు బోర్డింగ్‌లో ఉన్న రైతులు (on boarding farmers), వ్యాపారులు / పెద్ద కొనుగోలుదారులు, అస్సేయర్లు మరియు లాజిస్టిక్‌లను బలోపేతం చేయానికి ఈ-నామ్ ప్లాట్‌ఫారమ్‌లోకి నమోదు చేయడం

ప్రతి మున్సిపాలిటీలో రైతు బజార్ విస్తరణ, మొబైల్ రైతు బజార్‌లను పెంచండం, గేటెడ్ కమ్యూనిటీలలో కూడా అందించడం.

మార్కెట్ జోక్యం ద్వారా ఈ మార్కెటింగ్ శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ ద్వారా ధరల నియంత్రణలో భాగంగా అవసరమైన వస్తువులను (కూరగాయలు) సేకరించి సరఫరా చేస్తుంది.

**2024-25 సంవత్సరానికి గాను మార్కెటింగ్ శాఖకు రూ.314.80 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నాం.**

## 5. సహకార శాఖ

**" సహకారం అనేది ధనికుల ఆయుధం కాదు పేదలకు రక్షణ కవచం"**

– మహాత్మాగాంధీ

### గ్రామీణ సంస్థలు.. నిజమైన వృత్తిపరమైన రైతు కేంద్రీకృతమైన బలీయమైన సంస్థలు.

సహకార రంగం ఒక ప్రభావవంతమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వ్యవసాయం & అనుబంధ రంగాలను ప్రోత్సహించడంలో ఈ రంగం ప్రధాన పాత్ర పోషించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

కేంద్ర ప్రభుత్వ చొరవతో **"సహకార్ సే సమృద్ధి"** దేశంలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఒక విప్లవాత్మకమైన చర్య. రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలలో ఖచ్చితత్వం, పారదర్శకతను తీసుకురావడానికి సాంకేతిక ప్రమేయాలతో పాటు బహుళార్ధ సాధక కార్యకలాపాలను ప్రోత్సహించడమవుతున్నది.

**గ్రామీణ పరపతి సహకార సంఘాలు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార రంగం మూడు అంచెల వ్యవస్థగా ఉంది. రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) 18 శాఖలు కలిగి, జిల్లా స్థాయిలో 13 జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు 436 శాఖలు జిల్లా ప్రధాన కార్య స్థానాలు, చిన్న పట్టణాలు, పాక్షిక పట్టణ ప్రాంతాలలో ఉన్నవి. గ్రామీణ స్థాయిలో 2042 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు 67.75 లక్షల సభ్యులతో పని చేయుచున్నవి. ఆప్కాబ్ 2024–25 సంవత్సరంలో రూ. 4404.71 కోట్ల ఎస్‌టి–ఎస్ఏఓ (ST-SAO) ఋణాలు రూ. 559.58 కోట్ల దీర్ఘకాల వ్యవసాయ పరపతిని అందించింది.

**కౌలు రైతులు:** రాష్ట్రంలోని కౌలురైతులు వ్యవసాయ ఉత్పాదకతకు అవసరమైన సహకారం అందించే వారు కాని ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. భూమిపై యాజమాన్యం లేకపోవడం, అధికారిక ఆర్థిక సంస్థలకు అనుషంగిక భద్రత లేని కారణంగా వారికి ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు రావడం లేదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు, అవసరమైన, సకాలంలో ఋణాన్ని పొందేందుకు కౌలురైతు విధానాన్ని ప్రారంభించింది. 2024–25లో 18,626 మంది కౌలు రైతులకు SAO ఋణం కింద రూ. 163.69 లక్షలు అందించింది.

1) **కంప్యూటరైజేషన్ ద్వారా పిఏసిఎస్ (PACS) లను బలోపేతం చేయడం :**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2037 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల యొక్క సామర్థ్యం. పారదర్శకత, జవాబుదారీతనం, సమర్ధతను పెంపొందించడం ద్వారా వాటి సభ్యులకు ఆర్థిక సేవలను అందించడం కొరకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రతిపాదిత పథకం " పిఏసిఎస్‌ల డిజిటలైజేషన్" ను వినియోగించుకొంటున్నది. ఈ ప్రాజెక్టు కాలవ్యవధి (5) సంవత్సరాలు (2022-23 నుండి 2026-27 వరకు).

ఈ పథకం రూ. 81.54కోట్ల అంచనా వ్యయంతో అమలు చేయడమవుతున్నది.

ఈ పథకం వలన పిఏసిఎస్‌లోని రైతు సభ్యులు మెరుగైన ఆర్థిక సమ్మిళితత్వాన్ని కలిగి ఉంటారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు యొక్క B@ncs 2024తో పిఏసిఎస్ సాఫ్ట్‌వేర్‌ని సమన్వయం చేయడం వలన అదనపు స్థాపన ఖర్చు లేకుండా 6000 + బ్యాకింగ్ టచ్ పాయింట్‌లు సృష్టించబడతాయి.

ఎల్‌జిడి (LGD), వెబ్‌ల్యాండ్, పౌరసరఫరాల సేకరణ, రిజిస్ట్రేషన్ పోర్టల్‌లతో ఏకీకరణ వలన పిఏసిఎస్ కార్యకలాపాలకు ఖచ్చితత్వం మరియు పారదర్శకత, ప్రామాణికతను తీసుకువస్తుంది. e-kyc - ఆధార్ సమన్వయంతో నకిలీ రుణాలకు చెక్ పెట్టబడుతుంది.

2). **వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఎఐఎఫ్) :**

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ క్షేత్ర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రాలుగా పిఏసిఎస్‌లను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మన ప్రభుత్వం నాబార్డ్ నుండి (90 శాతం) పునరార్థిక సహాయంతో కూడిన రాష్ట్రాభివృద్ధి పథకం. రాష్ట్ర ప్రభుత్వం పిఏసిఎస్‌లకు మద్దతుగా 10 శాతం ఋణాన్ని అందిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది. ప్రతిపాదించిన 1167 గోదాములలో 689 గోదాములు పూర్తయ్యాయి. ఆహార భద్రతను కట్టుదిట్టం చేయడానికి గానూ 3.87 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యాన్ని కల్పించడమైనది.

NCML, NeRL మొదలైన అనుషంగిక సేవా ప్రదాతలు ఈ గోడౌన్‌లను బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రంగా ఉపయోగించుకొనుటకు చొరవ తోసుకోబోతుంది.

A.P. Civil Supplies Corporation / MARKFED/FCI ప్రత్యేక MOAలోకి ప్రవేశించి గోడౌన్లను ఉపయోగించుకునేలా ప్రతిపాదించబడింది.

**ఇతర కార్యకలాపాలు:**

విస్తారమైన గ్రామీణ ప్రాంతాలను కలిగి ఉన్న పిఏసిఎస్‌లను వాటి సుస్థిరతను పెంపొందించడానికి అన్ని ఇ-పరిపాలన సేవల కోసం సాధారణ సేవా కేంద్రాలుగా, నోడల్ కేంద్రాలుగా వినియోగించడమవుతున్నది.

పిఏసిఎస్ నిర్వహిస్తున్న పెట్రోల్ / డీజల్ డీలర్‌షిప్ యొక్క వ్యాపార నమూనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్భవించింది. (26) పిఏసిఎస్‌లో పెట్రోల్ బంక్‌లు పనిచేయడం ప్రారంభించాయి. పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ 64 ఎన్‌ఓసిలను జారీ చేసింది.

చౌక ధరలకు ఆరోగ్య సంరక్షణ సేవలు మెరుగుపరచడానికి గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ మందులను అందుబాటులోకి తీసుకురావడం కోసం పిఏసిఎస్‌లు జన్ ఔషధి కేంద్రంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ఫార్మాస్యూటికల్స్ శాఖ జన్ ఔషధి కేంద్రాలను ప్రారంభించడానికి పిఏసిఎస్‌కు అర్హతను ఇచ్చింది.

ఈ చొరవ వలన పిఏసిఎస్‌లకు ఆదాయాన్ని పెంచుతుంది మరియు గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. 73 పిఏసిఎస్, 8 డిసిఎంఎస్‌లు జన్ ఔషధి కేంద్రాలుగా అమ్మకాలు ప్రారంభించాయి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక హోల్‌సేల్ పంపిణీ కేంద్రాన్ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడమైనది. ప్రస్తుతం ఈ అభ్యర్ధన కేంద్ర ప్రభుత్వం మరియు ఫార్మాస్యూటికల్స్ & మెడికల్ డివైసెస్ బ్యూరో ఆఫ్ ఇండియాల పరిశీలనలో ఉన్నది.

**సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద వికేంద్రీకృత ధాన్యం నిల్వ కార్యక్రమం:** భారత ప్రభుత్వం సహకార రంగంలో ప్రపంచంలోనే అతి పెద్ద ధాన్యం నిల్వ కార్యక్రమాన్ని ప్రారంభించింది. భారతదేశంలో మొత్తం ఆహార లాభం ఉత్పత్తి 311 MMT, మొత్తం నిల్వ సామర్థ్యం 145 MMT మాత్రమే, అందువల్ల 166 MMT నిల్వ సామర్ధ్యాల కొరత ఉంది. PACS స్థాయిలో ధాన్యం నిల్వను వికేంద్రీకరించడం వలన పంట కోత తర్వాత నష్టాలు తగ్గుతాయి మరియు FCI / రాష్ట్రప్రభుత్వం ద్వారా ధాన్యం సేకరణకు సహాయ పడుతుంది. NABCONS వారు PACS లకు సేవా సహకారాన్ని అందిస్తోంది.

**ఇతర పథకాలు :**

**3). సమీకృత సహకార అభివృద్ధి ప్రాజెక్టులు (ఐసిడిపి) :**

మునుపటి తూర్పు గోదావరి, కర్నూలు మరియు చిత్తూరులలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) ఆర్థిక సహాయంతో IIవ దశ క్రింద సమీకృత సహకార అభివృద్ధి ప్రాజెక్టు (ఐసిడిపి) అనేది ఒక పథకంగా ఉంది.

ఈ ప్రాజెక్టు క్రింద, (13) నూతన గోదాములు-కం-కార్యాలయ భవనాలను నిర్మించడం జరిగింది. ఇప్పుడు ఈ భవనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వినియోగించుకుంటున్నాయి.

**క్రొత్త పథకాలు:**ఐటి ప్రమేయాల ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయడం అనే కేంద్ర ప్రతిపాదిత పథకం క్రింద సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయాలను కంప్యూటరీకరించడం అనేది ఒక క్రొత్త పథకం మొత్తం వ్యయం రూ.4.33కోట్లు.
హార్డ్వేర్ వ్యయం మరియు సాఫ్ట్వేర్ నిర్వహణా వ్యయం 60:40 నిష్పత్తిగా ఉంది. హార్డ్వేర్ మరియు సాఫ్ట్వేర్లను రాష్ట్ర ప్రధాన కార్యాలయం, (90) జిల్లా, డివిజనల్ సహకార అధికారుల కార్యాలయములకు అందించడమవుతుంది. 2024-25 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం రూ.1.75కోట్ల బడ్జెట్ను కేటాయించింది.

**క్రొత్త కార్యక్రమాలు:** డిజిటలైజేషన్ ప్రాజెక్ట్ యొక్క విజయం ఆన్లైన్ సిస్టమ్లో నమోదు చేయబడిన డేటా యొక్క ఖచ్చితత్వం మరియు సమగ్రతలో ఉంది. మిషన్ మోడ్లో e-kyc డ్రైవ్లను ప్రారంభించాలని నాబార్డ్ వారు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను అభ్యర్థించింది. ఈ చర్యలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సహకార సంఘములు రూల్స్, 1964లోని నిబంధన **(5)కి సవరణ ద్వారా "(5) చెల్లింపు, ఏదైనా ఉంటే సభ్యత్వం యొక్క హక్కును వినియోగించుకోవడానికి షరతుగా చేయవలసిన లేదా పొందవలసిన వడ్డీ మరియు ఆధార్ వంటి పత్రాలతో మీ కస్టమర్ వివరాలను కూడా తెలుసుకోండి**" సహకార సంఘాలకు e-kyc విధిగా చేపట్టింది.

**2024-25 సంవత్సరానికి గాను సహకార శాఖకు రూ.308.26 కోట్ల బడ్జెట్ను ప్రతిపాదిస్తున్నాం.**

## 6. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం:

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (A.N.G.R.A.U), రాష్ట్ర రైతుల ఉత్పత్తి, పోషణ, ఆర్థిక స్థితిని మెరుగు పరిచే అంతిమ లక్ష్యంతో వ్యవసాయం, వ్యవసాయ ఇంజనీరింగ్ & సాంకేతికత, సామాజిక శాస్త్ర విభాగాలలో విద్యా, పరిశోధన, విస్తరణ కార్యకలాపాల ద్వారా రాష్ట్రానికి సేవలు అందిస్తోంది. 2023-24 సం॥లో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం, A.I.C.R.P.- మిల్లెట్స్, A.I.C.R.P.-M.U.L.L.a.R.P వారికి "బెస్ట్ పర్ఫార్మింగ్ A.I.C.R.P.సెంటర్లు" గా అవార్డును ప్రధానం చేసారు. I.C.A.R. వారిచే 2023-24సం॥నికి గాను C.e.R.A.(కన్సార్టియం ఫర్ ఇ-రిసోర్సెస్ ఇన్ అగ్రికల్చర్) A.N.G.R.A.Uకు బెస్ట్ అవార్డ్ను ప్రదానం చేసారు.

2023సం॥లో రాష్ట్ర స్థాయిలో (యస్.వి.ఆర్.సి.) నూతనంగా అధిక దిగుబడినిచ్చే 9 రకాలను విడుదల చేశారు.

2024 - 25 సంవత్సరంలో 10 ప్రధానమైన పంటలలో డ్రోన్ ద్వారా వ్యవసాయ రసాయనాలను పిచికారికి స్థిరమైన కార్యాచరణ విధానాలను అభివృద్ధిచేయటంలో విశ్వవిద్యాలయం దేశంలోనే మెట్టమొదటిది. వీటితోపాటు డ్రోన్ పైలెట్లకు శిక్షణను కూడా నిర్వహిస్తోంది.

**విశ్వవిద్యాలయం 2024 సంవత్సరములో సాధించిన పేటెంట్స్ వివరాలు:**

ఇన్ వివో పద్ధతిలో గ్లైసమిక్ ఇండెక్స్, సంబంధిత కిట్ నిరూపణ, నానోబయోచార్ తయారీ, అవలంబించే పద్ధతి, మిరపలో గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ యూనిట్.

వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థిరమైన ఆదాయం ద్వారా రైతుల శ్రేయస్సుని పెంపొందించేందుకు ఎదురు చూస్తూ పర్యావరణ వ్యవస్థలను పరిరక్షిస్తూ, ఆహార మరియు పోషక భద్రతకోసం వాతావరణ స్మార్ట్ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం జరిగింది.

**ఆచార్యఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 2024-25 వసంవత్సరానికి రూ.507.038** కోట్ల **బడ్జెట్‌ని ఇవ్వటానికి ప్రతిపాదించాం.**

**7.డా॥ వై.యస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం:**

డా॥ వై.యస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రధానంగా విద్య, పరిశోధన, విస్తరణ లలో ఉద్యాన రంగంలో మానవ వనరుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ విశ్వవిద్యాలయం క్రింద ఉన్న 44 సంస్థలు అనగా 5 ఉద్యాన కళాశాలలు, 4 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు, 20 పరిశోధన స్థానాలు, 4 కృషి విజ్ఞాన కేంద్రం లతోపాటు 4 ప్రైవేట్ ఉద్యాన కళాశాలలు,7 ప్రైవేట్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలు పనిచేస్తున్నాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ICAR), న్యూ ఢిల్లీ వారి నేషనల్ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ అక్రిడేషన్ బోర్డ్ వారిచే డా॥ వై.యస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, A గ్రేడ్ పొందినది.

దర్శి ఉద్యాన పరిశోధనా స్థానంలో మునగ పై "జెనెటిక్ డైవర్సిటీ క్రాప్ ఇంప్రూమెంట్ అండ్ వాల్యుయేషన్" ప్రాజెక్టు ప్రారంభించబడింది.

"మన గ్రామం మన విశ్వవిద్యాలయం" కార్యక్రమం ద్వారా ఈ విశ్వవిద్యాలయ పరిధిలోని 44 సంస్థలు 44 గ్రామాలను దత్తత తీసుకున్నారు. దీనితో మొత్తం 171 గ్రామాలు ఈ కార్యక్రమం క్రింద గత నాలుగు సంవత్సరాలలో దత్తత తీసుకోబడినవి.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించుటకై విశ్వవిద్యాలయంలోని కె.వి.కె. వెంకట్రామన్నగూడెం మరియు ఉద్యాన కళాశాల వెంకటరామన్నగూడెం నందు భారీ డ్రోన్లు అందుబాటులో ఉంచి రైతులకు ప్రదర్శనలు నిర్వహించబడుతున్నాయి.

**2024-25 సంవత్సరానికి గాను డా॥ వై.యస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం రూ. 102.227 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించాం.**

**8. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం:**

పశుగణాభివృద్ధి, పాల సాంకేతిక రంగ అభివృద్ధి, మత్స్య సంపద పెరుగుదలకు తద్వార రైతుల అభ్యున్నతికి శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది. ఈ విశ్వవిద్యాలయ పరిధిలో మొత్తం 39 సంస్థలు బోధన, శిక్షణ, పరిశోధన మరియు విస్తరణ రంగాలలో గణనీయమైన సేవలను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వము, ఇతర సంస్థల ద్వారా మన్ననలను పొందుతూ పురోగమిస్తున్నది.

ర్యాబిస్ వ్యాధిని గుర్తించడానికి అత్యాధునిక పరిశోధనశాల విశ్వవిద్యాలయానికి కేటాయించబడినది.

2023-2024 సం॥లో సుమారు 5 లక్షల ఒంగోలు జాతి, 1 లక్ష పుంగనూరు జాతి వీర్యనాళికలు, 65 వేల పశుగ్రాస పిలకలను, 700 వనరాజా కోళ్ళను రైతులకు అందజేసినారు.

3 పశువైద్య అత్యవసర వైద్య వాహనాలు, 2 పశువిజ్ఞాన ప్రచార వాహిని వాహనాలను ఏర్పాటుచేసి రైతులకు సేవలు అందజేస్తున్నాం.

**2024-25 ఆర్థిక సంవత్సరానికి శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయంకు రూ.171.72 కోట్లను** ప్రతిపాదించాం.

9. **ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం:**

చేపల పెంపకం, ఆక్వాకల్చర్ లో వృత్తిపరమైన నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో నూతన ఫిషరీస్ సైన్స్ కళాశాలలో 60 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడమైంది.

NSPAAD ప్రాజెక్ట్ కింద వ్యాధి నిఘా కార్యక్రమం జరుగుతుంది. బ్రూడ్ బ్యాంక్ ప్రోగ్రామ్ కింద బ్రూడ్ స్టాక్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రామ్ జరుగుతుంది.

రాష్ట్రంలో మత్స్య మరియు ఆక్వా రంగాల సమగ్రాభివృద్ధి కొరకు కావలసిన నిపుణులను తయారు చేయడం జరుగుతుంది. మత్స్యకారులు,సన్నకారు ఆక్వా రైతుల సామాజిక, ఆర్థిక ప్రమాణాలను మెరుగు పరచటానికి సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, విస్తరణ కార్యక్రమాలు చేపడుతున్నారు.

**2024-2025లో ఆశించే కీలక ఫలితాలు:** అత్యాధునిక మల్టీమీడియా మాడ్యూల్స్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం.

ఎక్స్టర్నల్ ఫండింగ్ ప్రాజెక్టుల ద్వారా పరిశోధన కార్యకలాపాలను బలోపేతం చేయడం.

చేపల పెంపకందారులకు అధునాతన రోగ నిర్ధారణ, చికిత్స సదుపాయాలు అందించడం.

ఆక్వాకల్చర్ లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం.

కొత్తగా ఏర్పాటైన ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీకు రూ.18 కోట్లు మరియు శాశ్వత భవనాలు, మౌలిక వసతుల కోసం రూ.20 కోట్లు వెరసి **2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.38 కోట్ల బడ్జెట్ను ప్రతిపాదించాం.**

## 10. పశుసంవర్ధక శాఖ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అపారమైన పశువనరులకు ఆలవాలం. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఒంగోలు, పుంగనూరు గోజాతులు, శ్రేష్టమైన నెల్లూరు, మాచర్ల జాతి గొర్రెలు, ఆశిల్ జాతి కోళ్ళు సైతం మన రాష్ట్రంలో ఉండడం మనకు గర్వకారణం. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో సైతం స్థిరమైన ఆదాయ వనరుగా – సుస్థిర సూచికగా, ఈ రంగంపై ఆధారపడిన పేదవారికి జీవనాధారంగా, వారికి బ్రతుకు తెరువు నిస్తున్న పశు సంవర్ధన రంగానికి గౌరవనీయులైన ముఖ్యమంత్రి పశుసంవర్ధక రంగంలో వినూత్న కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు పశుపోషకులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 2024-25 నాటికి దేశంలో పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో నిలవాలని మన ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

2024-25 ఆర్థిక సంవత్సరానికి గోకులం పథకం ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పశువులకు ఆశ్రయం కల్పించలేని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు చెందిన పేద పశుపోషకులకు 90 శాతం రాయితీపై 2/4/6 పశువుల షెడ్స్ నిర్మాణం చేపట్టడానికి, 70 శాతం రాయితీపై గొర్రెలు / మేకలు / కోళ్ళ షెడ్స్ నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదించింది.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీధి పశువులకు ఆశ్రయం కల్పించడం, రక్షించడం, పోషించడం, చికిత్స అందించడం, పునరావాసం కల్పించేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ప్రతి జిల్లాకు రూ.50 లక్షల చొప్పున మొత్తం 26 జిల్లాలకు రూ.13 కోట్లు కేటాయించి జిల్లాకు ఒకటి చొప్పున గోశాలలు నిర్మాణం చేపట్టడానికి అనుమతులు మంజూరు చేయడం జరిగినది.

పశుపోషకుల ఇంటివద్దనే అత్యుత్తమ పశువైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 340 సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులో ఉంచడం జరిగినది. ముఖ్యంగా ఈ వాహనాల ద్వారా పశు ఆరోగ్య సేవలతో పాటు అనారోగ్య పశువు ఉన్న చోటనే సత్వర పశు వ్యాధి నిర్ధారణ జరిపి, ఖచ్చితమైన, నాణ్యమైన పశువైద్యం అందించడం జరుగుతుంది.

ఈ పథకం ద్వారా పశువైద్య సేవలు అందించడానికి, వాహనాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 19.34 కోట్ల నిధులను ప్రతిపాదించడం జరిగినది.

ఈ ఆర్థిక సంవత్సరంలో పశువుల పశుగ్రాస అవసరాలను తీర్చడానికి రూ. 22 కోట్ల అంచనాల వ్యయంతో "పశుగ్రాస భద్రతా విధానం-2021-26"ని అమలు చేయాలని ప్రతిపాదించింది.  ఇప్పటి వరకు 5519 మంది పశుపోషకులకు 75 శాతం రాయితీపై 1211.42 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలను మరియు 60 శాతం రాయితీపై 2971 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా సరఫరా చేయడం జరిగినది.

పశువులు / జీవాలు / పందులు మరణించినట్లైతే, పశుపోషకులు ఆర్థికంగా నష్టపోకుండా ఆదుకునేందుకు ఈ ఆర్థిక సంవత్సరం రూ. 25 కోట్ల వ్యయంతో పశు బీమా పథకాన్ని అమలు చేయడం జరుగుతోంది. ఈ పథకం కింద ప్రభుత్వం SC/ST/BPL కుటుంబాలకు చెందిన పశుపోషకులు చెల్లించ వలసిన బీమా ప్రీమియంలో 80 శాతం రాయితీ, APL కుటుంబాలకు చెందిన పశుపోషకుల బీమా ప్రీమియంలో 50 శాతం రాయితీ అందిస్తుంది.

పశుపోషకులకు సరళమైన, సరళీకృత విధానంతో ఒకే విండో కింద బ్యాంకుల నుండి సకాలంలో పశువుల దాణా, ఆరోగ్య నిర్వహణ, పశుగ్రాసాల సాగు, ఇతర కార్యకలాపాల కోసం స్వల్పకాలిక ఋణాలను అందించడానికి ప్రచార పద్ధతిలో రాష్ట్రంలోని అర్హులైన పశు పోషకులందరికీ పశు కిసాన్ క్రెడిట్ కార్డులను (PKCC) జారీ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

పశువుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ, ఈ ఆర్థిక సంవత్సరంలో  రూ. 81.83 కోట్ల నిధులతో అన్ని పశు వైద్యశాలలకు మందుల సరఫరా చేయడానికి ప్రతిపాదనలు తయారుచేయడం జరిగినది.

ఈ ఆర్థిక సంవత్సరంలో పశువుల వ్యాధుల నియంత్రణ, టీకాలు మరియు నులిపురుగుల మందుల కొనుగోలు, సరఫరా కొరకు రూ. 29.75 కోట్ల ప్రతిపాదించడం జరిగినది.

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 0.37 కోట్ల బడ్జెట్‌ను షెడ్యూల్ కులాల ఆవాస ప్రాంతాలలో పశువుల పునరుత్పత్తి శిబిరాల నిర్వహణ, మందుల కొనుగోలు, దూడల నిర్వహణ కొరకు కేటాయించడానికి ప్రతిపాదనలు సిద్ధంచేయడం జరిగినది.

యాదవ, కురబ, కురుమ కుటుంబాలకు చెందిన మహిళా పశుపోషకుల జీవనోపాధి మెరుగుదలకు, వారి ఆర్థిక పురోగతిని ప్రోత్సహించడానికి పేదరిక నిర్మూలన సంస్థ అనుసంధానంతో ఎంపిక చేయబడిన మహిళా పశుపోషకులకు గొర్రెలు/మేకల యూనిట్ల కొనుగోలులో ఆర్థిక సహాయం అందించడానికి ప్రతిపాదించడం జరిగినది. ఇందుకు గాను మొత్తం యూనిట్ ఖరీదులో 40 శాతం ప్రభుత్వ రాయితీ, 50 శాతం బ్యాంకు ఋణ సదుపాయం, 10 శాతం లబ్ధిదారుని వాటాగా నిర్ణయించడం జరిగినది.

మన ప్రభుత్వం పశుసంవర్ధక రంగం ద్వారా పశుపోషకులకు వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేసి పశుపోషకుల ఆర్ధికాభివృద్ధికి తోడ్పాటును అందించడానికి మరియు వారి జీవనప్రమాణాలను మెరుగు పరచడానికి **2024-25 ఆర్థిక సంవత్సరానికి పశుసంవర్ధక శాఖ బడ్జెట్ రూ.1095.71 కోట్లుగా ప్రతిపాదించడం జరిగినది.**

**11.పాడి పరిశ్రమాభి**వృద్ధి:

రాష్ట్రంలోని మొత్తం 55607 అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ద్వారా పాల సరఫరా చేయబడుతుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు 85 లక్షల లీటర్ల యూహెచ్‌టీ పాలను విజయ వజ్రా పేరుతో సరఫరా చేయుచున్నాం.

రాష్ట్రంలో 5 పశుగ్రాసం ఉత్పత్తి దారుల సంస్థలను స్థాపించబడి వాటి కార్యకలాపాల ప్రారంభానికి ప్రతి సంఘానికి 3.0 లక్షలు విడుదల చేయబడ్డాయి.

గ్రామస్థాయి సొసైటీలలో పాల నాణ్యతా పరీక్ష పరికరాలు సౌకర్యాలు, మండల స్థాయిలో శీతలీకరణ సౌకర్యాలు మరియు పాడి రైతులకు శిక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి NPDD ప్రాజెక్ట్ ద్వారా అమలు చేయుటకు రూ. 202.62కోట్లు (గ్రాంట్రూ. 133.41కోట్లు & MSS రూ.69.21కోట్లు) మంజూరు చేయబడినది.

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె డెయిరి నందు రోజుకి 3 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల నెయ్యి ప్లాంట్‌ను, శ్రీసత్యసాయి జిల్లా హిందూపూర్‌లో డెయిరి నందు రోజుకి 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల పశుదాణ ఉత్పత్తి కర్మాగారం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకొనడమైనది.

పులివెందులలోని APCARL లో పాలు & పాల ఉత్పత్తుల నాణ్యతా పరీక్షలు చేయుటకు రాష్ట్ర స్థాయి లేబరేటరీ ఏర్పాటు చేయడమైనది.

ప్రస్తుత మహిళా డెయిరీ కోపరేటివ్ సొసైటీల ద్వారా ప్రతిరోజూ పాల సేకరణ కార్యకలాపాలు (1,502) నిర్వహించబడుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని డైరీలను పర్యవేక్షిస్తూ పాడి రైతులకు, పాలకు సరైన ధర ఇచ్చుటకు అన్ని చర్యలు చేపట్టబడుచున్నది.

**12. మత్స్యశాఖ:**

స్వర్ణ ఆంధ్ర - 2047లో లక్ష్యాలను సాధించడానికి ఫిషరీస్, ఆక్వా రంగాన్ని ఒక గ్రోత్ ఇంజన్‌గా గుర్తించబడింది. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో దేశంలో ఆంధ్రప్రదేశ్, 29.1శాతం వాటాతో అగ్రగామిగా ఉంది. ఈ రంగం రాష్ట్ర స్థూల విలువ జోడింపునకు 9.15 శాతం, వ్యవసాయ స్థూల విలువ జోడింపునకు 25.3 శాతం అందిస్తుంది. దేశ సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల విలువలో రూ.19,420 కోట్లతో రాష్ట్రానిదే అగ్రస్థానం.

**1. మంచినీటి మత్స్య అభివృద్ధికి చర్యలు:** మత్స్యకారుల జీవనోపాధి పెంచుటకు, ప్రభుత్వం G.O. Ms. No.217ను రద్దు చేసి చెరువులలో మత్స్య సంపద హక్కులను సహకార సంఘాలకు నామమాత్రపు లీజుకు ఇచ్చు హక్కులు మత్స్యకారులకు తిరిగి పునరుద్ధరించబడింది. చేపల ఉత్పత్తిని పెంచడానికి, మత్స్యకారుల ఆదాయాన్ని పెంపొందించడానికి 370 లక్షల చేప పిల్లలను ప్రభుత్వ నీటి వనరులలో విడుదల చేస్తున్నారు. చేపల ఉత్పత్తుల ఇ-మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచడానికి, ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం 1525 మంది చేపల విక్రేతలు ONDCలో నమోదు చేయబడ్డారు.

**2. సముద్ర మత్స్య అభివృద్ధికి చర్యలు:** మత్స్యకారుల నిఘా, భద్రత, టూ వే కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేయడానికి 1135 కమ్యూనికేషన్, ట్రాకింగ్ పరికరాలు/ట్రాన్స్‌పాండర్స్ పడవల్లో అమర్చబడ్డాయి. పులికాట్ సరస్సులోని 20వేల మత్స్యకారుల కుటుంబాల ప్రయోజనం కోసం, తిరుపతి జిల్లా వాకాడు మండలం రాయదరువు గ్రామం వద్ద రూ.97.09 కోట్లతో సముద్ర ముఖ ద్వారం తెరవడం కోసం చర్యలు తీసుకుంటున్నాం.

ఫిషింగ్ బోట్లకు డీజిల్ ఆయిల్ పై సబ్సిడీ లీటరుకు రూ.9 ఇచ్చుచున్నాం. నేటి వరకు అర్హతగల 23,047 యాంత్రిక మరియు మర బోట్‌లకు ప్రయోజనం చేకూర్చేందుకు రూ.2,667 లక్షలు సబ్సిడీని ఖర్చు చేయబడినది. 2024-25సం॥లో మొత్తం రూ.5,000 లక్షలు ప్రతిపాదించబడింది.

**ఆక్వాకల్చర్ అభివృద్ధికి చర్యలు:** ప్రభుత్వం చేసిన వాగ్దానం ప్రకారం, ఆక్వాకల్చర్ రైతులకు వారి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి రూ.1.50 పైస/యూనిట్ చొప్పున విద్యుత్ సరఫరా చేయబడుతుంది.

ఆక్వా & నాన్–ఆక్వాజోన్‌లలో అర్హత కలిగిన ఆక్వా సర్వీస్ కనెక్షన్‌లకు (అంటే 68,134 కనెక్షన్‌లు) చర్యలు చేపట్టబడుతుంది. మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రూ. 88.08 కోట్లతో బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం (మం) లో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటు కానుంది.

**ఫిషరీస్ డెవలప్‌మెంట్ స్కీమ్:** ఈ పథకం ద్వారా చెరువులలో చేప పిల్లలను విడుదల చేయుట, ఐస్ బాక్సుల సరఫరా, ప్రభుత్వ ఫిష్ సీడ్ ఫామ్‌ల నిర్వహణ, మెరైన్ బోట్ల రిప్లేస్‌మెంట్, ఎక్స్‌గ్రేషియా మొదలగు వాటి కొరకు రూ. 897.8 లక్షలు కేటాయించడమైంది.

**కేంద్ర ప్రాయోజిత పథకం–PMMSY** క్రింద ఫిషింగ్ ఇన్‌పుట్‌లు, హేచరీలు, బయోఫ్లోక్ యూనిట్లు, ఐస్ ప్లాంట్లు, ఫిష్ మార్కెటింగ్ కార్యకలాపాలు, ఫిషింగ్ హార్బర్‌లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌లు, ఆర్టిఫిషియల్ రీఫ్‌ల కోసం రూ. 294 కోట్లు ప్రతిపాదించబడింది.

2024–25సం॥లో సెప్టెంబర్ వరకు చేపలు, రొయ్యల ఉత్పత్తి లక్ష్యం 52.75 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 25.82 లక్షల మెట్రిక్ టన్నులు సాధించింది.

**2024–25సంవత్సరానికి మత్స్య రంగం అభివృద్ధికి రూ. 521.34 కోట్లు ప్రతిపాదించడమైనది.**

**13. విద్యుత్ శాఖ:**

**"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం"** క్రింద వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుబడి ఉంది.

ప్రస్తుతం రాష్ట్రంలో 21.81 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ఉన్నాయి.

ఆక్వాకల్చర్ సేవల టారిఫ్ 2024–25 సంవత్సరానికి APERC ఆమోదించిన టారిఫ్ ఆదేశం ప్రకారం యూనిట్‌కు రూ. 3.85గా నిర్ణయించబడినది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం యూనిట్‌కు రూ. 2.35 సబ్సిడీ భరించి అర్హత కల్గిన ఆక్వా సేవలకు యూనిట్ రూ. 1.50కు తగ్గింపుతో విద్యుత్ సరఫరా అందిస్తుంది.

**వ్యవసాయ వినియోగదారులకు 9 గంటల పగటి విద్యుత్ సరఫరా**

**మౌలిక వసతులు:**

ప్రస్తుతం రాష్ట్రంలోని వ్యవసాయ సేవలు 6987 ఫీడర్‌ల ద్వారా సరఫరా చేయబడుతున్నాయి, వీటిలో గత మూడు సంవత్సరాలలో మౌలిక వసతులు పెంచడంతో 6744 ఫీడర్‌లు 9 గంటల పగటి సరఫరాను అందించగలవు.

మిగిలిన 243 ఫీడర్‌లు కూడా ప్రస్తుతం ఉన్న నెట్‌వర్క్‌తో రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా అందిస్తున్నాయి.అందువల్ల, రైతులకు విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించబడుతుంది.

**పునర్వ్యవస్థీకరించబడిన పంపిణీ రంగ పథకం (ఆర్.డి.ఎస్.ఎస్)**

విద్యుత్ మంత్రిత్వశాఖ 2021 జూలై 20న వినియోగదారుల విద్యుత్ సరఫరా నాణ్యత, విశ్వసనీయత మెరుగుపరచడం లక్ష్యంగా పునర్వ్యవస్థీకరించిన పంపిణీ రంగ పథకానికి అనుమతి ఇచ్చింది.

ఈ క్రమంలో M/s PFC, APDISCOMs కు రూ.13250 కోట్ల ఆర్థిక సహాయాన్ని క్రింద పనులకు మంజూరు చేసింది. స్మార్ట్ మీటరింగ్ రూ.4112 కోట్లు, మౌలిక వసతులు – రూ.9139.58 కోట్లు (లైన్ల పునరుద్ధరణ, యు.జి. కేబుల్స్ వేయడం, P.T.R.లు & D.T.R. ల పెంపు, HVDS, SCADA, IT సేవలు, శిక్షణ మొదలైనవి)

**వ్యవసాయ రంగానికి సంబంధిచిన ఆర్.డి.ఎస్.ఎస్ పథక పురోగతి:**

స్మార్ట్ మీటరింగ్ పనుల క్రింద రూ.9563 కోట్ల వ్యయంతో 59,81,558 మీటర్లకు అనుమతి లభించింది మరియు మొత్తం 2,56,943 మీటర్లు క్యాటగిరీలకు మరియు నెట్‌వర్క్ పరికరాలకు (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు & ఫీడర్లు) ఇన్‌స్టాల్ చేయబడ్డాయి.

నష్ట నివారణ పనుల కోసం రూ.11,142.13కోట్లు కేటాయించబడ్డాయి (వ్యవసాయ ఫీడర్ల విభజన మరియు 33కె.వి. ఫీడర్ల విభజన పాత/ అరిగిపోయిన ఫీడర్ల మార్పిడికై రూ.9718.65 కోట్లు మరియు మిగిలినది డిజాస్టర్ భూగర్భ కేబులింగ్ మరియు ఐటి వ్యవస్థ పనులకు).

లక్ష్యంగా ఉన్న 5583 ఫీడర్లకు గాను 666 వ్యవసాయ ఫీడర్ల విభజన పూర్తయింది. మిగిలిన వాటి పనులు కొనసాగుతున్నాయి.

**M/s SECI తో ఒప్పందం:**

తేది.2021 డిసెంబర్ 1న ఏ.పి.డిస్కమ్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి M/s SECI తో (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) తో వ్యవసాయ సరఫరా అవసరాలకు సరిపడ 9 గంటల పగటిపూట విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించేందుకు 30 సంవత్సరాల పాటు 7000 మెగావాట్ల సౌర విద్యుత్ కొనగోలు కోసం త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి.

**2024-25 సంవత్సరానికి విద్యుత్ రంగ అభివృద్ధికి రూ. 7241.30 కోట్లు ప్రతిపాదించడమైనది.**

## 14.వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం:

**అధక్షా!**

అణచివేతకు గురైన వారి వ్యవసాయ ఉత్పాదకత, జీవనోపాధులను పెంచాలన్న చట్టం యొక్క ఉద్దేశానికి అనుగుణంగా ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో పనులుచేస్తున్నాం. ఈ పథకం కింద బంజరు భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చడం, పండ్లతోటలు, మొక్కల పెంపకం, పొలంగట్లపై మొక్కలు నాటడం, గడ్డి పెంపకం వంటి పనులు చేపడుతున్నాం.

నీటి సంరక్షణ, భూసార పరిరక్షణ పనులు చేయడం వల్ల భూగర్భ జలాల పెంపుదల, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, చిన్న నీటి చెరువుల పునరుద్ధరణ సాధ్యమవుతోంది. సప్లై ఛానళ్లు, ఫీల్డ్ ఛానళ్లు, ఫీడర్ ఛానళ్ళు అభివృద్ధి చేయడం వల్ల తిరిగి చెరువులు వాస్తవ సామర్థ్య నిల్వలకు చేరుకుంటున్నాయి.

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ చట్టం, షెడ్యూల్-1 ద్వారా ప్రతిజిల్లాలో చేపట్టే పనుల్లో 60 శాతం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పనులు చేయడానికి అవకాశముంది. భూమి, నీరు, చెట్ల పెంపకం వంటి అభివృద్ధి పనుల వల్ల నేరుగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల ఉత్పాదక ఆస్తులు పెంచవచ్చు.

పథకం ద్వారా రైతులకు మద్దతు నిచ్చి వ్యవసాయం మరింత సులభతరం చేయడానికి ఉపాధి హామీ పథకం, అనుబంధ విభాగాలను సమన్వయ పరిచి నిధులను ఆదాయం వచ్చే కార్యక్రమాలలో పెట్టుబడులు పెట్టి తద్వారా వ్యవసాయ రంగం నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా సేద్యపు నీటికుంటలు, కరవు నివారణ చర్యలు, పట్టుపురుగుల పెంపకం, పండ్ల తోటల పెంపకం వంటి ప్రధాన కార్యక్రమాలను అమలు చేస్తోంది. తద్వారా చిన్న, సన్నకారు రైతులకు కరువు పరిస్థితులలో ఆసరాగా నిలుస్తోంది.

సేద్యపు నీటికుంటలు తవ్వి వర్షాకాలంలో వృధాగా పోయే నీటిని నిల్వ చేసుకోవడం, తద్వారా భూగర్భ జలాలను పెంచుకునేలా చేయడం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నీటి నిల్వ పనులను ప్రోత్సహించడం వంటి పనులు చేపడుతున్నారు. 2024-25 సం॥లో ఇప్పటి వరకు రాష్ట్రంలో4,905 పంటకుంటల తవ్వకం పూర్తి కాగా, ఇంకా 20,924 పనులుప్రగతిలో వున్నాయి. ఈ పనులతో పాటుగా10,216 వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రాలు (ఆర్.ఎస్.కె) మరియు 3,734 పాల శీతలీకరణ కేంద్రాల (బి.యం.సి.యు) నిర్మాణ పనులు పురోగతిలో వున్నాయి.

**వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల కింద చేపడుతున్న ఇతర పనులు:** పండ్ల తోటల పెంపకం, చిన్న నీటి చెరువుల పునరుద్ధరణ, పూడిక తీత పనులు, భూమి అభివృద్ధి పనులు, ఊట చెరువులు/ చిన్న ఊట చెరువులు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిబంధనల మేరకు మొత్తం వ్యయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలకు 60 శాతం ఖర్చు పెడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) లో ఉపాధి హామీ పథకం కింద ఈ పనుల కోసం రూ.2162 కోట్లు ఖర్చు పెట్టారు.

**2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రూ.5150 కోట్లు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పనులకు ప్రతిపాదించాం.**

**15. ఎన్.టి.ఆర్. జలసిరి:**

అధ్యక్షా !

ప్రతి ఎకరా సాగు భూమికి నీరందించేందుకు అవసరమైన, అర్హులైన రైతులకు ఉచితంగా బోరు బావులు తవ్వడం ఎన్.టి.ఆర్ జల సిరి కార్యక్రమం యొక్క లక్ష్యం. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం కింద 24,538 బోరు బావులు తవ్వారు.

2024-25సం॥లో ఎన్.టి.ఆర్ జల సిరి కార్యక్రమంలో 20 వేల బోర్లను ఉచితంగా వేయడానికి రూ.300 కోట్లు, 15వేల మోటార్స్‌ను ఉచితంగా పంపిణి చేయడానికి రూ.225. కోట్లు ప్రతిపాదించాం. తద్వారా 30 వేల మంది రైతులకు లబ్ది చేకూర్చడం, 1 లక్ష ఎకరాలను అదనంగా సాగులోకి తీసుకురావాలని సంకల్పిచాం.

**2024-25 సంవత్సరానికి ఎన్.టి.ఆర్ జల సిరి అమలుకి ఈ ఏడాది బడ్జెట్ లో రూ. 50 కోట్లను ప్రతిపాదిస్తున్నాం.**

**16. నీటి వనరుల శాఖ:**

అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌కు ఆ పేరును శాశ్వతం చేయుటకు జలవనరులను సుస్థిరం. ఆయకట్టు విస్తీర్ణం పెంచుట, స్థిరపరచుటయే లక్ష్యాంగా మా ప్రభుత్వం నీటి వనరులకు ప్రధాన్యమిచ్చాం. రాష్ట్రంలో 40 భారీ, మధ్యతరహా, చిన్న నదులు, 40,817 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు (3,573 ట్యాంక్ క్యాస్కేడ్‌లు), 15.35 లక్షల బోరు బావులు, 1132 ఎత్తిపోతల పథకాలు, 59,176 చెక్‌డ్యామ్‌లు, 61,834 పెర్కోలేషన్ ట్యాంకులు, 6.32 లక్షల ఫారం పాండ్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు 106.120 లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చేయబడింది.

**ఆంధ్రరాష్ట్ర వాటర్ పాలసీ-2024:** వివిధ జలసంబంధమైన సమస్యలను పరిష్కరించడానికి, కరువు నివారించడానికి, వినియోగదారులకు, గృహ అవసరాలు, నీటిపారుదల, పారిశ్రామిక, ఆక్వా, ఇతర అవసరాలకు నీటిని విరివిగా అందించడమే సమగ్ర కొత్త నీటి విధానం యొక్క లక్ష్యాలు.

**పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు**: ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కి జీవనాడి. దీనికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. ప్రాజెక్టు కోసం రూ. 55,548.87 కోట్ల నిధులను ఆమోదించింది.

**పోలవరం నీటిపారుదల ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ:** ఈ కాలువ తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా & ఎన్.టి.ఆర్ జిల్లాలలో 3,18,851 ఎకరాలకు సాగునీరు మరియు 80 TMC గోదావరి నది నీటిని కృష్ణా నదికి మళ్లించడానికి ప్రతిపాదించబడింది.

**పోలవరం నీటిపారుదల ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువ:** అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 3,99,997 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు, విశాఖపట్నం నగర పారిశ్రామిక అవసరాలకు, గృహావసరాలకు 23.44 టీఎంసీల నీటిని సరఫరా చేసేందుకు, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ కాలువ ప్రతిపాదించబడింది.

ఎడమ ప్రధాన కాలువ పనుల అమలు కోసం సవరించిన పరిపాలనా ఆమోదంలో, రూ. 4,202.69 కోట్లు మంజూరు చేయబడినవి.

**డయాఫ్రమ్ వాల్:** 1396.6 మీటర్ల పొడవుతో కొత్త డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించాలని ప్రతిపాదించబడింది, దీని నిర్మాణానికి సన్నాహక పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**చింతలపూడి ఎత్తిపోతల పథకం** ద్వారా పశ్చిమగోదావరి జిల్లాలోని తాళ్లపూడి మండలం, తాడిపూడి గ్రామం వద్ద అఖండ గోదావరి నది కుడి ఒడ్డున, 90 రోజుల్లో 3 దశల్లో 53.50 టి.ఎమ్.సి. గోదావరి నది వరద నీటిని ఎత్తిపోసేందుకు ఉద్దేశించబడింది మరియు 4.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో నీటిపారుదల సౌకర్యాన్ని కల్పించడంతోపాటు కాలువ ద్వారా 25.94 లక్షల జనాభాకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదించబడింది.

మొదటి దశలో 2.10 లక్షల ఎకరాల నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు మరియు 3 మధ్య తరహా ప్రాజెక్టులు క్రింద ఉన్న 70,000 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడానికి ,2.0 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించడం కొరకు ప్రధాన కాలువ యొక్క బ్యాలెన్స్ పనులను పూర్తి చేయడానికి ప్రతిపాదించాం.

**గోదావరి, పెన్నా నదుల అనుసంధానం మొదటి దశ:** నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఇన్ ఫ్లోలు తగ్గిపోవడం, ఎగువ రాష్ట్రాలు అధికంగా జలవినియోగం చేయడం వల్ల నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ఆయకట్టుకు రావలసిన నీరు అందడం లేదు. అందువలన దీనికి నీరు అందించడానికి గోదావరి పెన్నా నదుల అనుసంధానం ప్రతిపాదించ బడినది.ప్రకాశం బ్యారేజీ ఎగువ భాగం నుండి 73.00 టిఎంసిల నీటిని పల్నాడు, గుంటూరు, బాపట్ల మరియు ప్రకాశం జిల్లాల్లోని నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు మరియు 60.25 లక్షల జనాభాకు తాగునీరు అందించడానికి ఈ పథకం నిర్దేశించబడినది.ప్రాజెక్ట్ అంచనా విలువ రూ.6020.15 కోట్లు.

**బి.ఆర్.ఆర్. వంశధార ప్రాజెక్ట్ రెండవ దశ స్టేజ్–II:**

ఈ ప్రాజెక్ట్ క్రింద కాట్రగడ వద్ద ఆనకట్ట(సైడ్ వియర్)ను నిర్మించి వంశధార నది వరద నీటిని 33.704 కి.మీ పొడవు గల వరద కాలువ ద్వారా 19.05 టి.ఎమ్.సి.సామర్ధ్యం గల హీరమండలం జలాశయాన్ని నింపుతూ పారాపురం జలాశయం, సింగిడి జలాశయాన్ని నింపి 40వేల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేయడం ప్రధానోద్దేశం. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు రూ.2059.55 కోట్ల వ్యయంతో 92 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లాలోని 9 మండలాల్లోని 225 గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుంది .

**పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్:** ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 30 మండలాల్లోని మెట్ట ప్రాంతాల్లో 4.473 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల జనాభాకు తాగునీరు అందించడానికి ఈ ప్రాజెక్టు రూపకల్పన చేయబడింది. ప్రాజెక్టు అంచనా విలువ 9700 కోట్లు.

**హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్:** హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ రాయలసీమలోని నాలుగు జిల్లాలలో 6.025 లక్షల ఎకరాల (ఖరీఫ్ ID) కు నీటిపారుదల సౌకర్యానికి, కృష్ణా నది నుండి 40టి.ఎమ్.సి వరద నీటిని ఉపయోగించి సుమారు 33 లక్షల మందికి తాగునీటిని అందించడానికి ప్రతిపాదించబడినది. మొత్తం సవరించిన ప్రాజెక్ట్ విలువ రూ.13635.63 కోట్లు.

చిన్న తరహా నీటిపారుదల క్రింద మొత్తం 40817 చెరువుల క్రింద 25.60 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు మరియు ఆయకట్టును స్థిరీకరించుట ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి నీటిపారుదల సౌకర్యాలను అందిస్తోంది.

**రియల్ టైమ్ మానిటరింగ్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 40 పెద్ద, మధ్య మరియు చిన్న నదులతో నదీ ప్రవాహ రాష్ట్రం, రాష్ట్రంలో 108 రిజర్వాయర్లు నిర్మించబడ్డాయి. వీటి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను కరువు నిరోధక రాష్ట్రంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

భారీ వరదలు 2024: ఇటీవల కృష్ణానదికి దాదాపు 12 లక్షల క్యూసెక్కుల భారీ వరద నీరు వలన బుడమేరుకు గండ్లు పడ్డాయి. అయినను ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకుని వెంటనే గండ్లు పూడ్చివేయించినది. భవిష్యత్తులో బుడమేరుకు ఇటువంటి పెను ప్రమాదం నుండి పంటల నష్టాన్ని తప్పించేందుకు రూ. 3300 కోట్ల అంచనా వ్యయంతో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశాం.

**2024-25సం॥లో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణకు రూ. 14637.03 కోట్లను ప్రతిపాదిస్తున్నాం.**

ఈ సృష్టిలో ఏ స్వార్ధంలేని వ్యక్తి రైతు. పరోపకారమే పరమధర్మంగా భావించి, పరుల అన్నార్తిని తీర్చడమే తన తృప్తిగా భావించే నిర్మలమైన హృదయం కలవాడు అన్నదాత. ఎన్ని ప్రకృతి విపత్తులు సంభవించినా, ఎన్ని ఉపద్రవాలు ఉవ్వెత్తున ఎగిసిపడినా.. తాను నమ్మిన మట్టిలో నాగలి పట్టి సేద్యం చేసే నాయకుడు రైతన్న. అలాంటి మనిషికి ఏమి చేసినా తక్కువే.

రైతులకు ఎంత సాయం చేస్తే మన ఆర్ధిక వ్యవస్థ అంత బలపడుతుంది.. అన్నదాతకు మనం ఎంత అండగా నిలిస్తే మన రాష్ట్రం అంత సుసంపన్నం అవుతుందని అనే వ్యక్తి మన ముఖ్యమంత్రి. ఆ బాటలోనే రైతులకు చేయూతనివ్వడానికి నిత్యం కృషి చేస్తున్నాం.

నా ప్రసంగాన్ని ముగించే ముందు రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు వ్యవసాయ శాఖ మంత్రిగా తొలిసారి వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఇది మంచి ప్రభుత్వం ... ప్రజల మేలు కోరే ప్రభుత్వం.

**రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ మరియు అనుబంధ శాఖల బడ్జెట్ 2024-25 సంవత్సరానికి గాను మొత్తం రూ. 43402.33 కోట్లను ప్రతిపాదిస్తున్నాను.**

2024-25 బడ్జెట్‌ను సభ ఆమోదం కోసం సమర్పించడమైంది.

**శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు**
**వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక,**
**పాడిపరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖామాత్యులు**